# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక





సంపుటి :27 సంచిక: 03 హైదరాబాద్ 2026 జూలై పేజీలు 40

Please visit : www.srimeherbaba.com విడిప్రతి 20/-




# మౌన వార్షికోత్సవం
# చిత్రమాల



# మెహెర్ సందేశం

**యావత్తు ప్రపంచం గ్రుడ్డిదనే చెప్పాలి. ఎందువల్లనంటే,**
ప్రతిఒక్కనిలో వున్న భగవంతుడ్ని దర్శించకుండా,
నిత్యం చూస్తున్న ఈ అందచందాలు నిజమని నమ్ముతున్నారని
బాబా అన్నారు. మీరు చూస్తున్న ఈ ప్రపంచం అంతా మాయ.
అంతా మిథ్య అని బాబా పలుమార్లు హెచ్చరించారు.

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

*వ్యవస్థాపకులు:*
**శ్రీ దశిక ప్రసాదరావు**

## లోపలి పేజీలలో...

| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | మౌన వార్షికోత్సవ వేడుకలు | 6 -11 |
| 3. | కుర్షేద్ తలాతి | 12-17 |
| 4. | టేబుల్ హౌస్ | 18 |
| 5. | దేవదేవుడ్ని దర్శించండి | 19 |
| 6. | లార్డ్ మెహెర్ | 20-25 |
| 7. | పెండూ ఆయుష్షు | 26-27 |
| 8. | దహీగాంలో ఆఖరి సమావేశం | 28 - 29 |
| 9. | గురుప్రసాద్ బాబా సమక్షంలో | 30-31 |
| 10. | మా మాటలు | 32 -33 |
| 11. | సమాధి పరిరక్షణ | 34 |
| 12. | మా ప్రచురణలు | 38 |
| 13. | చిత్రమాల | 39 |
| 14. | జీవితసభ్యులు | 40 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

**ముఖ చిత్రం**

టేబుల్ హౌస్, మెహెరాబాద్

**మనవి**

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవల్సింది. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 26న హైదరాబాద్‌లో పోస్టు చేస్తున్నాం.**

# చల్లపల్లి బాబా కేంద్ర 61వ వార్షికోత్సవం

## 2026 ఆగస్టు 29, 30 తేదీలలో

**చల్లపల్లి బాబా కేంద్ర 61వ వార్షికోత్సవం రెండ్రోజులపాటు 2026 ఆగస్టు 29, 30** తేదీలలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు శ్రీ చుండూరి మెహెర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆగస్టు 29వ తేది సాయంత్రం 4 నుండి ఆగస్టు 30 సాయంత్రం 4 వరకూ ప్రత్యేక ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు శ్రీ చుండూరి తెలిపారు. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొనవల్సిందిగా కోరుతున్నారు. ప్రేమికుల రాకపోకల వివరాలను తగిన ఏర్పాట్లు చేయుటకు వీలుగా ఆగస్టు 20లోగా ఫోన్ నంబర్లు 94401 12351 / 83281 04197 /96862 61302 / 99636 58859 తెలియజేయవల్సిందిగా కోరుతున్నారు

# మనోనాశ్ -అమృతోత్సవాలు

**అవతారుడు మనోనాశ్ కార్యక్రమం చేపట్టి 2026 అక్టోబరు నాటికి 75 సంవత్సరాలు నిండుతున్నాయి.** 1949 అక్టోబర్ 16న బాబా నవజీవనం ప్రారంభించిన విషయం పాఠకులకు తెలుసు. నవజీవనానికి ముగింపుగా 1951 అక్టోబరు 16 నుండి 23 దాకా ఖాజాగూడ కొండపై వున్న చిన్న గుహలో మెహెర్‌బాబా **మనోనాశ్** కార్యక్రమాన్ని నిర్వహించారు. 1951 అక్టోబరు 24న హైదరాబాద్ నుండి కాలినడకన మెహెరాబాద్‌కి బయల్దేరారు. ఈ సందర్భంగా, హైదరాబాద్‌లో రెండు రోజుల మనోనాశ్ అమృతోత్సవ వేడుకలు 2026 అక్టోబరు 17న జూబ్లి బాబా కేంద్రంలో, అక్టోబరు 18న మనోనాశ్ గుహ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొనవల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు. దూరప్రాంతాల నుండి విచ్చేయు వారికి తగిన వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. **ఇందుకు ఆఖరు తేది 2026 జూలై 31.** మరిన్ని వివరాలకు వాట్సప్ నంబర్లు - 9849046848, 9652422599, 9396702076, 924652609 సంప్రదించగలరు. **అందరూ ఆహ్వానితులే.**

# మెహెర్‌బాబా పత్రిక కోసం

**మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ కోసం 2026 జూన్ / జూలై నెలలలో**

1. **శ్రీ చుండూరు నాగేశ్వరరావు, చల్లపల్లి కుటుంబసభ్యులు రూ.3,000/-**
2. **బాబా ప్రేమికులు తమ పేరు ప్రచురించవద్దని రూ. 1000/- పంపినారు.**

**వీరిద్దరికి పత్రిక పక్షాన ధన్యవాదములు, జైబాబా**

*సంపాదకీయం*

# బాబా నామవ్యాప్తి

**మౌన వార్షికోత్సవం వైభవంగా ముగిసింది. ఇకపై పలుచోట్ల బాబా కేంద్ర వార్షికోత్సవ** వేడుకలు, ప్రేమిక సహవాస్‌ల నిర్వహణ కాలం ప్రారంభమైంది. ఒక సందర్భంలో బాబావారి కార్యదర్శి ఆదీ. కె. ఇరాని తన స్వానుభవంతో చెప్పిన మాటల్ని సావధానంగా ఆలకించుదాం. ఆదీ గారి మాటలు ఇలా వున్నాయి.

***

**మెహెర్‌బాబా మహత్యాలు చేయనని అనేకమార్లు ప్రకటించారు.**
హృదయపూర్వకంగా నామస్మరణ చేయమన్నారు. నీవు ద్వేషించే వారితో కూడా ప్రేమగా వుండమన్నారు. అలా చేయడమే తనను ఆరాధించడమని బాబా స్పష్టం చేశారు.
**ఐతే, ఇదేం మాటల్లో చెప్పినంత సుళువైందేమీ కాదని బాబా కూడా చమత్కరించారు!**

**ఆధ్యాత్మిక ఆనందం అనంతమైనది, శాశ్వతమైందని అన్నారు బాబా.**
మీలోని మంచి, చెడు అన్ని లక్షణాలు తనకు సమర్పించమన్నారు.
అనంత ఆనందాన్ని అనుభవించమన్నారు. ఎవరైతే నేడు బాబాను అవతారునిగా స్వీకరించి, విధేయులుగా వుంటారో వారందరూ ధన్యులన్నారు బాబా.
ఇది చాలా గొప్ప విషయం అన్నారు బాబా.

**కాగా, తన అవతార ప్రకటీకరణ తర్వాత యావత్తు విశ్వం నన్ను అవతారునిగా గుర్తించి,** గొప్పగా ఆరాధిస్తారన్నారు. నా అవతార ప్రకటీకరణ తర్వాత మీరు నా ఎడల చూపే విధేయతకు ఎలాంటి ప్రాధాన్యత ఉండదన్నారు. అందుకు ఉదాహరణగా..
కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడు శ్రీకృష్ణుడి విశ్వరూప దర్శనం పొందాక, ఆతను కృష్ణుని ఎడల చూపిన విధేయతకు ఎలాంటి ప్రాధాన్యత ఉందన్నారు బాబా.
కాబట్టి, బాబా భక్తులందరికీ ఇదే మంచి సమయం.
**సుజనులారా...** బాబా నామస్మరణ చేయండి. బాబా గురించి పలువురికి తెలియజేయండి.
**భవిష్యత్తరాలవారు మిమ్మల్ని నిందించకుండా** బాబా నామాన్ని పలువురికి చేరవేసే ప్రయత్నం నేడే చేపట్టండి. ఈ మాటల్ని తన స్వానుభవంతో చెప్తున్నానన్నారు ఆదీ జీ.

***

**ఆదీ గారి మాటల్లోని అర్థాన్ని బాబా ప్రేమికులందరూ గ్రహించాలి!**
**రాబోయే సహవాస్‌ల నిర్వహణలో ఆదీ జీ మాటలు మార్గదర్శకం కావాలి.**
**బాబావారి కృప లభించు గాక!**

## సమీక్ష

# మెహెరాబాద్‌లో మౌన వార్షికోత్సవ వేడుకలు




**మెహెర్‌బాబా ప్రేమికులందరూ జూలై 10వ తేదీన మౌనం పాటించినట్లు భోగట్టా. తెలుగునాట** గల పలు బాబా సెంటర్లలో మౌన వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కాగా, ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా పలువురు బాబా ప్రేమికులు మౌన వార్షికోత్సవానికై మెహెరాబాద్‌కు జూలై 8వ తేదీకల్లా చేరుకున్నారు. తెలుగువారు అధిక సంఖ్యలో మెహెరాబాద్‌కు రెండ్రోజులు ముందుగా అవతారుని సమక్షంలో మౌనంగా గడిపేందుకు చేరుకున్నారు. మెహెరాబాద్ దాకా రాలేని పాఠకుల సమాచారం నిమిత్తం 2026 జూలై 9, 10 నాటి విశేషాలను క్లుప్తంగా తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాం.

జూలై 10 నాటికి రమారమిని మూడు వేలమందికి పైగా బాబా ప్రేమికులు మెహెరాబాద్‌కు విచ్చేశారని అంచనా. వీరందరికీ దిగువ మెహెరాబాద్‌లోని హాస్టల్స్,యంపిసి, యంపిఆర్, ఆంధ్రా రెస్టు హౌసులో బస ఏర్పాటు చేశారు. మెహెరాబాద్‌లో జూలై 12న ధుని కార్యక్రమానికి హాజరై, ఆ దరిమిలా అధికశాతం బాబా ప్రేమికులు తమ స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. మౌనం రోజున మెహెరాబాద్ వాతావరణం చాలా ఆహ్లాదకరంగా, చల్లని గాలులతో ఎంతో ప్రశాంతంగా వుంది.

**జూలై మొదటివారంలో మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిసాయి. ఈ వానల తాకిడికి ముంబాయి** – పూణే రైలు మార్గంలో కొండచరియలు విరుచుకుపడి పలు రైళ్ళ రాకపోకలకు అంతరాయం కలిగింది. హైదరాబాద్ వెళ్ళాల్సిన రైళ్ళు జూలై 13వ తేదీ దాకా ఆలస్యంగానే నడిచాయి.




## మహారాష్ట్రలో భారీ వర్షాలు

ఇదిఇలావుంటే, జూలై ఏడెనిమిది తేదీల వరకూ మెహెరాబాద్‌లో వానలు పెద్దగానే కురిసాయి. జూలై 9న కూడా మెహెరాబాద్‌లో వాన పడింది. విశేషం ఏమంటే ఆ పిదప మెహెరాబాద్‌లో వాన లేదు. భళ్ళున ఎండ కాచింది. ఇది అవతారుని చమత్కారం అని బాబా ప్రేమికులు భావించారు. బాబా దర్శనం క్యూ లైన్లలో నిల్చున్నవారు వానలో తడిసిముద్దౌతారని, ఎంత పెద్ద వాన వచ్చినా ప్రేమికులు తడవని రీతిలో ట్రస్టువారు క్యూలైన్లపైన గట్టి ఇనుపరేకులతో పకడ్బందీ ఏర్పాటు చేశారు. ఈ వానల వల్ల పాదచారులు నడిచే మార్గం గట్టి పడింది. గాలికి దుమ్ము లేవకుండా సహకరించింది.

## క్యూ పొడవు కుదింపు

**వయోధికులకు సౌకర్యవంతంగా వుండేలా, ఈ దఫా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వయస్సులో పెద్దవారు** క్యూ లైన్లలో ఎక్కువసేపు నిల్చోకుండా ప్రశాంతంగా బాబా సమాధికి ఎదురుగా కూర్చునేందుకు వీలుగా విశాలమైన షామియానా, అందులో ప్రత్యేకంగా సుమారు 200 కుర్చీలు ఏర్పాటు చేశారు. ఆ పిదప, 5 నుండి 10 మంది బృందంగా, ఎక్కువ దూరం నడిచే అవసరం లేకుండా, బాబా దర్శనం చేసుకునే వీలు కల్పించారు. ఈ ఏర్పాటు వల్ల వయస్సులో పెద్దవారికి ఎంతో సుఖవంతంగా వుంది.

**అలాగే, అన్ని వయస్సుల వారు కూడా దర్శనం క్యూలో ఎక్కువసేపు నిల్చుని ఇబ్బంది పడకుండా** వుండేందుకు వీలుగా, 'దర్శనం క్యూ లైను బారికేడ్లకు' ఎదురుగా ప్రత్యేకంగా


టిన్ షెడ్ ప్రాంగణం

మరో 200 కుర్చీలు ఏర్పాటు చేశారు. పొడవాటి దర్శనం క్యూలో గంటలసేపు నిల్చోకుండా, దర్శనార్థులను ముందుగా కుర్చీలో వేచి వుండే అవకాశం కల్పించారు. ఆ పిదప క్యూలో వున్న ప్రేమికుల సంఖ్యను బట్టి, వేచి వున్నవారందరినీ క్యూ లోకి అనుమతించారు. ఈ విధానం తమకెంతో సౌకర్యవంతంగా వుందని పలువురు అభిప్రాయపడ్డారు. దర్శనం కోసం క్యూలో వున్న వారికి కూడా సుమారు 30 నిముషాలలో బాబా దర్శనం లభించింది.

## వయోధికులే ఎక్కువ

**దర్శనార్థులలో వయోధికులే ఎక్కువగా కనిపించారు. మగవారి కంటే మహిళా ప్రేమికుల సంఖ్య** ఎక్కువగా వుందనీ చెప్పాలి. యువత సంఖ్య తక్కువగా వుంది. ఐతే, హాజరైన వారిలో ఎక్కువమంది వాలంటీర్లుగా హుషారుగా పనిచేశారు. కార్లు, స్కూటర్లు పార్కింగ్ ప్రదేశంలో, దర్శనం క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరుపమానమైన సేవలు అందజేశారు. సుమారు 500 మంది వాలంటీర్లు ఈ వేడుకలలో పాల్గొన్నారు.

జూలై 9 రాత్రి 12 గంటలకు మౌనం ప్రారంభించడానికి మునుపు రాత్రి 9 నుండి బాబా భజన గీతాలు, ప్రార్థనలు పఠించారు. ఆ రోజు రాత్రి 12 గంటలకు అవతారుని జయజయధ్వానాలతో మౌనం ప్రారంభించారు. మౌనం రోజున నిశ్శబ్దం రాజ్యమేలింది మెహెరాబాద్‌లో. ప్రేమికులు బాబా నామస్మరణలో గడిపారు. డి-హాస్టల్ సమీపంలో ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. బాబా సాహిత్యం, లాకెట్లు వగైరా విరివిగా లభించాయి. **విచ్చేసిన బాబా ప్రేమికుల్ని జూలై 9,11,12 తేదీలలో మెహెరాజాద్‌కు ప్రత్యేక బస్సుల్లో** తీసుకెళ్ళారు. మెహెరాజాద్‌కు ఉదయం 10.30 నుండి 12.30 గంటల నడుమ బాబా ప్రేమికులను అనుమతించారు. విచ్చేసిన ప్రేమికులందరితో ట్రస్టు చైర్మన్ మాటా మంతిగా అనేక విషయాలు ప్రస్తావించారు. మెహెరాజాద్‌లోని పూదోట పచ్చని మొక్కలతో, అందమైన




టేబుల్ హౌస్

రంగు రంగుల పూలతో అవతారుని బృందావనం ఆకర్షణీయంగా వుంది. మెహెరాబాద్‌లో 1925 జూలై 10న మౌనం ప్రారంభించిన జోపిడి దగ్గర కూడా ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. మౌన వార్షికోత్సవానికి విచ్చేసిన వారందరూ జోపిడిని దర్శించుకునేలా ఉదయం 9 నుండి సూర్యాస్తమయం వరకూ తెరచి వుంచారు. సప్తవర్ణ పతాకాన్ని జోపిడీ ఎదురుగా అవిష్కరించారు.

**ఆంధ్రా రెస్టుహౌసులో మౌన** వార్షికోత్సవం సందర్భంలో విచ్చేసే ప్రేమికుల కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. జూలై 9, 10, 11 తేదీలలో ఆంధ్రా రెస్టు హౌసు నుండి బాబా సమాధి దాకా ఉచిత ఆటో సర్వీసు నిర్వహించారు. వయస్సు రీత్యా పెద్దవారికి ఇదొక అద్భుత అవకాశంగా భావించారు. అలాగే వయస్సులో పెద్దవారందరికీ మంచాలు, పరుపులు, చలిని తట్టుకోవడం కోసం దుప్పట్లు, రగ్గులు అందజేశారు. నీటి ఎద్దడి గల ఈ ప్రాంతంలో విచ్చేసిన బాబా ప్రేమికులకు ఎలాంటి ఇబ్బంది కలగని రీతిలో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి తగిన సరఫరా చేశారు. నిజామాబాద్ జిల్లాలోని వర్ని, జొన్నాడ బాబా సెంటర్ బాబా ప్రేమికులు స్వచ్ఛందంగా రెస్టుహౌసులో బస చేసిన ప్రేమికులకు చక్కని భోజన సౌకర్యం కల్పించారు. ఈ దఫా తెలుగువారు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలవారు ఎక్కువగా మౌన వార్షికోత్సవానికి హాజరయినట్లు గమనించడమైంది.

యంపిఆర్, డి- హాస్టల్స్‌లో బస చేసిన ప్రేమికులకు ఉదయం, సాయంత్రం బాబా సమాధి దగ్గర నిర్వహించే ప్రార్థనలు, ఆరతి కార్యక్రమానికి హాజరయ్యేందుకు వీలుగా వయోధికుల కోసం ట్రస్టువారు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సదుపాయం పట్ల ప్రేమికులు హర్షం వ్యక్తం చేశారు.



## ధుని ప్రజ్వలన

**జూలై 12న సాయంత్రం 6.45** నిముషాలకు ధుని వెలిగించారు. ధుని కార్యక్రమానికి ప్రేమికులు పెద్దఎత్తున హాజరయ్యారు.

**దిగువ మెహెరాబాద్ చుట్టుప్రక్కల** పెద్ద టౌన్‌షిప్ అభివృద్ధిచెందింది. తెలుగువారు చాలామంది తమ స్వంత ఇళ్ళు నిర్మించుకున్నారు. మరెందరో నూతన గృహ నిర్మాణాలు చేపట్టారు.

ఈ ఏడాది మౌన వార్షికోత్సవం సందర్భంగా జూలై 11న డాక్టర్ జయసూర్య, హైదరాబాద్ శ్రీ కనకయ్య, గుంటూరు గారి పెద్ద కుమారుడు శ్రీ కాకుమాను మెహెర్ కుమార్, జూలై 14వ తేదీన మెహెరాబాద్‌లో నూతన గృహ ప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా బాబా ప్రేమిక సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించారు.

## రవాణా సౌకర్యం అనూహ్యం

మెహెరాబాద్ ప్రధాన రహదారి నుండి బాబా సమాధి వరకూ చక్కని తారు రోడ్లు వేశారు. ఆరంగాం రైల్వే అండర్‌పాస్ నుండి ఖేడ్గాం, పూణే – అహిల్యానగర్ ప్రధాన రహదారి వరకూ తారురోడ్డు వేశారు. అహల్యానగర్ నుండి డోండ్ రైల్వే స్టేషన్ వరకూ రోడ్డు విస్తరణ పనులు పూర్తయి ఇప్పటికే ఐదారు సంవత్సరాలు నిండింది. ఈ మార్గంలో డోండ్ రైల్వే స్టేషన్ వరకూ ప్రధాన రహదారికి ఇరువైపులా ఎన్నో హోటళ్ళు, పెట్రోలు బంకులు, మరెన్నో వాణిజ్య సముదాయాలతో, నగర విస్తరణ భారీగా జరిగింది. ఒకప్పుడు ఈ రహదారిలో ప్రయాణం ఎంతో అసౌకర్యంగా వుండేది. మార్గమధ్యంలో వున్న రైలు గేటు వేస్తే చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చేది. నేడు ఆ సమస్య లేదు. రైలు గేటు వద్ద విశాలమైన ఫ్లై ఓవర్‌ని నిర్మించారు. ఇక్కడకు దగ్గరలోనే టోల్ గేట్ ఏర్పాటు చేసి టోల్ వసూళ్ళు కూడా ప్రారంభించారు. ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యం ఊహాకందనంతగా పెరిగింది.

**మెహెరాబాద్‌కి సొంత కార్లలో వచ్చే బాబా ప్రేమికులు ఎక్కువయ్యారు. వీరికి హైదరాబాద్ – ముంబాయి** నాలుగు లైన్ల జాతీయ రహదారి ఎంతగానో సౌకర్యవంతంగా వుంది. **రాష్ట్ర రవాణా శాఖ వారి బస్సులతో పాటు, అనేక ప్రైవేటు బస్సులు హైదరాబాద్ నుండి మెహెరాబాద్** వరకూ నిత్యం నడుపుతున్నారు. **గతంలో పోల్చితే అహమ్మద్‌నగర్‌కి రైలు సౌకర్యం కూడా చాలా మెరుగుపడింది. నేడు** కర్నాటకలోని బెంగళూరు నుండి ఆంధ్ర రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాల మీదుగా అహిల్యానగర్ వరకూ రెండు మూడు రైళ్ళ సౌకర్యం వుంది. ఉత్తరాది వారికి కూడా ఢిల్లీ – ముంబాయి మార్గంలో నేరుగా అహిల్యా నగర్‌కు చేరుకుంటున్నారు. **ఇకపోతే, దక్షిణాదిన ముఖ్యంగా తెలంగాణా, ఆంధ్రా వారికి మాత్రం అహిల్యానగర్ వరకూ** నేరుగా ప్రయాణించే రైలు సౌకర్యం లేదు. ఐతే, ఈ సౌలభ్యం కూడా అతిత్వరలో వచ్చే సూచనలు వున్నాయని రైల్వేశాఖ ఇటీవల ప్రకటించింది.

**ఈ అనూహ్య మార్పుని అవతారుడు 1920వ దశకంలోనే ప్రకటించారు. ఇదంతా అవతారుని దైవీ ప్రణాళికలోని భాగమని మనం గుర్తుంచుకుందాం!**

**ఇవన్నీకాదు కాని, మెహెరాబాద్‌కు ప్రత్యేక రైల్వే స్టేషన్ ఏర్పాటు జరగాలన్నది బాబా ప్రేమికుల కోరిక. ఈ మేరకు అవతారుడ్ని మనసారా ప్రార్థించుదాం.**

***



## అవతారునికి అంకితమైన తలాతీలు

# కుర్షేద్ తలాతి



* కుర్షేద్ పసికందుగా అవతారుని నీడలో పెరిగి పెదవాడయ్యాడు
* తల్లి పేరు దీనా తలాతి. తండ్రి నావల్ తలాతి. వీరు 1920వ దశకంలోనే ఉపాసనీ మహారాజ్ ఆశ్రమంలో బాబాని దర్శించుకున్నారు. ఉపాసనీ మహారాజ్ – మెహెర్‌బాబా సమక్షంలో దీనా – నావల్ తలాతీల వివాహ నిశ్చితార్థం జరిగింది.
* దీనా – నావల్ తలాతీలకు ముగ్గురు పిల్లలు. కుర్షేద్ పెద్ద కుమారుడు. ఇద్దరు కుమార్తెలు – వారి పేర్లు జూరూ, పర్వేజ్. పర్వేజ్ యొక్క భర్త ఎవరనుకున్నారు? బాబా ట్రస్టు మాజీ చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్.
* 1958 జనవరి 26 కుర్షేద్ 29 సంవత్సరాల వయస్సులో కన్నుమూశాడు.
* దిగువ మెహెరాబాద్‌లో పురుష మండలి సమాధులలో అలీ షా మస్తు సమాధికి ప్రక్కనే కుర్షేద్ అస్తికలను బాబా తన స్వహస్తాలతో వుంచారు. తరచి తరచి చదివితే ఈ శీర్షికలో అవతారుని లీలలు ఎన్నో ద్యోతకమవుతాయి. శ్రీమతి పర్వేజ్ శ్రీధర్ కేల్కర్ తన స్వీయ రచనలో తలాతీలు అవతారునికి అంకితమైన వైనాన్ని కళ్ళకుకట్టినట్లు వివరించారు.
* **ఇకపై కుర్షేద్ తలాతి కుటుంబీకుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం!**

**అవతారునికి తన జీవితాన్ని అంకితమిచ్చిన ధన్యుడు కుర్షేద్ తలాతి. చిన్నతనం నుండి** అవతారుని సమక్షంలో సేదతీరిన భాగ్యశాలి. ఒక్కమాటలో చెప్పాలంటే పుట్టిన క్షణం నుండి అవతారుని నీడలో పెరిగి పెద్దయ్యాడు కుర్షేద్. అవతారుడిని యుగావతారునిగా కీర్తించి, ఆరాధించిన కుటుంబ నేపథ్యం వీరిది. **కుర్షేద్ తల్లి పేరు దీనా తలాతి. తండ్రి నావల్ తలాతి. ముంబాయి వాస్తవ్యులు. నావల్ తలాతిని "నావల్ షా" అని బాబా ప్రేమగా పిలిచేవారు. తల్లితండ్రులు ఇద్దరూ 1920వ దశకంలోనే సాకోరి ఉపాసనీ మహారాజ్**

**ఆశ్రమంలో బాబాని దర్శించుకున్నారు.** అంతేకాదు, ఉపాసనీ మహారాజ్ స్వయంగా దీనా – నావల్ తలాతీల వివాహానికి పూనుకున్నారు. ఆయన సమక్షంలోనే సాకోరి ఆశ్రమంలో వారి పెళ్ళి నిశ్చితార్థానికి మహారాజ్ సుముహూర్తం నిర్ణయించారు. ఆ కార్యక్రమానికి దీనా తండ్రి హాజరుకాలేక పోయాడు. దాంతో ఆ వేడుకకి దీనా తండ్రిగా మహారాజ్ వ్యవహరించారు. నావల్ తరఫున తల్లితండ్రులుగా బాబా, ఆదీ కె ఇరానీ తల్లి గుల్మాయి వ్యవహరించారు. మహారాజ్ దీనా చేతికి ఆకుపచ్చని గాజులు తొడిగి, ఆమె నుదిట కుంకుమ దిద్దారు. దీనా – నావల్‌లకు బంగారు ఉంగరం బహుకరించారు. ఆ తర్వాత ఏ తేదీన వారి వివాహం జరిపించాలన్నది మెహెర్‌బాబా నిర్ణయిస్తారని మహారాజ్ ప్రకటించారు. వీరి వివాహం 1923 ఏప్రిల్ 9న మెహెర్‌బాబా సమక్షంలో వైభవంగా జరిగింది. ఆ సమయంలో మెహెర్‌బాబా బొంబాయిలోని మంజిల్ ఇ – మీంలో వున్నారు.

## మేర్వాన్‌కి విధేయులుగా

**ఒక సందర్భంలో, ఉపాసనీ మహారాజ్ దీనా –నావల్ తలాతీ, మరి ఇతరులు కొందరిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఇకపై మీరు మేర్వాన్‌ని అనుసరించమని ఆదేశించారు. మేర్వాన్‌కి విధేయులుగా వుండమన్నారు. పోస్టల్ కవర్‌కి అంటించిన తపాలా బిళ్ళలా మేర్వాన్‌కి అతుక్కుని వుండమన్నారు. ఆ పోస్టల్ కవరుపై ఎన్నిమార్లు గట్టిగా ముద్ర కొట్టినా ఆ స్టాంపు ఊడి రాకుండా, ఆ కవర్ ఎక్కడికెళితే అక్కడకల్లా వెళ్ళే పోస్టల్ స్టాంపులాగా, మేర్వాన్‌ని అంటిపెట్టుకుని ఉండమన్నారు మహారాజ్. నా యావత్ శక్తి మేర్వాన్‌కి ధారపోశానని, అన్నారు. మేర్వాన్ మిమ్మల్ని మీ జీవిత గమ్యానికి క్షేమంగా చేరుస్తాడని అన్నారు ఉపాసనీ.**

## కరెంట్ షాక్‌కి గురైన నావల్

**అనంతరం, బాబా నాసిక్ ఆశ్రమపు రోజుల్లో వీరు నాసిక్‌లో వున్నారు. వీరింటికి బాబా తరచు** వెళ్ళేవారు. వీరింట భోజనం చేయడానికి బాబా ఎంతో ఇష్టపడేవారు. నావల్ తలాతి మహారాష్ట్రలో ఎలక్ట్రిక్ కాంట్రాక్టర్‌గా పనిచేసేవాడు. 1938వ సంవత్సరంలో నాసిక్‌లో విధులకు హాజరవుతుండగా, నావల్ అకస్మాత్తుగా కరెంటు షాక్‌కి గురయ్యాడు. ఆ షాక్ నుంచి కోలుకోలేక పోయాడు. ఈ సమయంలోనే ఒకరోజున బాబా నావల్‌తో "నీవు దేని గురించి బాధపడొద్దు. నా నామం నిరంతరం స్మరించు. నీకేమైనా జరగరానిది జరిగితే, నీ కుటుంబ బాధ్యత నేను చేపడతానని బాబా హామీ ఇచ్చారు. బాబావారిచ్చిన ఈ వాగ్దానాన్ని కడదాకా అమలు చేశారు.

**1938 జూన్ 10న నావల్ కన్నుమూశాడు. బాబావారిచ్చిన మాట ప్రకారం తలాతీల** కుటుంబానికి అండగా వుండటమే కాకుండా, వారికి ప్రతినెలా క్రమం తప్పక ఆర్థిక సహాయం చేశారు. బాబావారి కార్యదర్శి ఆదీ సీనియర్ ద్వారా కొంత మొత్తాన్ని వారికి

పంపారు. దీనా తలాతి కుమార్తె పర్వేజ్ ఉద్యోగంలో చేరాక, వారికి ఆర్థికంగా కొంత వెసులుబాటు వచ్చింది. ఆపై ప్రతినెలా డబ్బు పంపవద్దని బాబాని కోరారు. ఐతే, బాబా చిరునవ్వుతో "ఇప్పుడే కాదులే ", అని మాత్రం అన్నారు. తాను పంపుతున్న నగదును 'బాబా ప్రసాదంగా' స్వీకరించమన్నారు. ఆ తర్వాత, 1967 నుండి 1968 డిసెంబరు వరకూ ఏక మొత్తంగా దీనాకు కొంత నగదును తన ప్రసాదంగా ఆదీ చేత బాబా పంపించారు. ఇకపై ప్రతినెలా నగదు పంపడం కుదరదని, బాబా ఒక సందేశంలో తెలియజేశారని శ్రీమతి పర్వేజ్ తన స్వీయరచనలో పేర్కొనింది.

**దీనా – నావల్ తలాతీలకు ముగ్గురు పిల్లలు. అందరిలో కుర్షేద్ పెద్దవాడు. జూరూ, పర్వేజ్** ఇద్దరు కుమార్తెలు. జూరూ వివాహం అయ్యాక ముంబాయిలోనే స్థిరపడింది. పర్వేజ్ యొక్క భర్త ఎవరో కాదు. బాబా ప్రేమికులందరికీ సుపరిచితుడు, బాబా ట్రస్టు చైర్మన్‌గా పనిచేసిన శ్రీ శ్రీధర్ కేల్కర్.

**ఇది ఇలావుంటే, పులి మీద పుట్రలా, వీరి కుమారుడు కుర్షేద్ లండన్‌లో ఆకస్మికంగా** గుండెపోటుతో మరణించాడు. అతనికి చిన్నప్పటి నుంచీ లండన్ వెళ్ళాలని గొప్ప కోరిక వుండేది. బాబా లండన్ పర్యటనకై వెళ్తూ, ఓడ ఫోటోతో వున్న పోస్టుకార్డు ఇచ్చారు. అది చూసిన కుర్షేద్ తనకూ లండన్ వెళ్ళాలని ఉందన్నాడు బాబాతో. **తప్పక వెళ్దువుగాని, పెద్దయ్యాక. నేనే నిన్ను పంపుతాను లండన్‌కి అని బాబా ఆనాడు** కుర్షేద్‌కి హామీ ఇచ్చారు. ఆ మాట కాకతాళీయం కాలేదు. కుర్షేద్‌కు లండన్‌లో ఉద్యోగం వచ్చింది.

## కుర్షేద్ – లండన్‌లో ఆకస్మిక మరణం

తండ్రి మరణించాక ఈతని సంపాదనపైనే వారి కుటుంబం ఆధారపడింది. ఆలాంటి పరిస్థితుల్లో ఒక రోజున పిడుగులాంటి అతని మరణవార్త వచ్చి పడింది. ఆ వేళ 1958 జనవరి 26, ఆదివారం. ఆ రోజున బాబావారి సోదరుడు ఆదీ జూనియర్ లండన్ నుంచి మెహెరాజాద్‌కి ఫోన్ చేశాడు. కుర్షేద్ తలాతి గుండెపోటుతో హఠాత్తుగా అంతక్రితం రోజుననే తుదిశ్వాస విడిచాడని ఆదీ మెహెరాజాద్ బాబా మండలికి తెలియజేశాడు. అప్పటికి కుర్షేద్ వయస్సు కేవలం 29 సంవత్సరాలు. కుర్షేద్ లండన్‌కి వెళ్ళే ముందు, అతడ్ని బాబా సతారాకు పిలిపించారు. ఆనాడు సతారాలో బాబా ఏకాంతవాసంలో వున్నారు. ఐనప్పటికీ కుర్షేద్‌కి ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. ఆ పిదప అతను లండన్‌కి బయల్దేరాడు. లండన్‌లో అతనికి నౌకరీ వచ్చింది. అందువల్ల అతను లండన్‌కి వెళ్ళాడు. దురదృష్టవశాత్తూ జరిగిన ఈ సంఘటన గురించి దీనా తట్టుకోలేదని బాబాకి తెలుసు. అందుకే బాబా స్వయంగా మెహెరాజాద్ నుంచి ఏరుచ్‌తో కలిసి కారులో బొంబాయికి వచ్చారు. **ఇక్కడ ఒక విషయం ప్రస్తావించాలి. అంతక్రితం ఏడాది అంటే 1957లో బాబా**

బొంబాయియికి పలుమార్లు తన మండలి వారందరితో కలిసి వచ్చారు. 1958 జనవరి నూతన సంవత్సర వేడుకల రోజున కూడా బాబా బొంబాయిలోనే వున్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకు మెహెరాజాద్‌కు తిరిగి వెళ్ళారు. ఐతే, మెహెరాజాద్‌కి వెళ్ళిన కొద్ది రోజులకే జనవరి 26న కుర్షేద్ మరణవార్త తెలుసుకుని, వెంటనే ఏరుచ్‌తో కలిసి కారులో బొంబాయికి హుటాహుటిన వచ్చారు. బొంబాయిలో తాను ఎప్పుడూ బస చేసే ఆర్నవాజ్ – నారిమన్‌ల అపార్ట్‌మెంట్ 'ఆషియానా'లో వుండి, దీనా తలాతి వారింటికి ఏరుచ్‌ని పంపారు. దీనాకు కుర్షేద్ మరణవార్తను జాగ్రత్తగా తెలియజేయమని బాబా ఆదేశించారు. ఆమెతో చాలా చాకచక్యంగా వ్యవహరించమని ఏరుచ్‌ని హెచ్చరించారు. ఈ వార్త విన్న దీనా, ఆమె పిల్లలు కంటతడి పెట్టరాదని బాబా షరతు విధించారు. కుర్షేద్ ఆఖరి క్షణాలలో బాబా నామం స్మరించాడు. అతను బాబాలో ఐక్యమయ్యాడు. కాబట్టి దీనా ఏమాత్రం ఏడవ రాదని, బాధపడరాదని బాబా ఏరుచ్‌తో కబురు చేశారు. ఈ షరతులకి సన్నద్ధమైతే, దీనా తన కుమార్తెలతో కలిసి ఆషియానాకు తన దర్శనార్థం రమ్మనమని ఏరుచ్‌తో కబురు పంపారు. దీనా తలాతికి ఇద్దరు కుమార్తెలలో పెద్ద కుమార్తె జూరూకి రెండు నెలల క్రితమే పెళ్ళయ్యింది. దీనా – పర్వేజ్‌లు ఇద్దరే ఇంట్లో వుంటున్నారు. ఆ రోజు సెలవు దినం. ఇల్లు శుభ్రం చేసుకుంటున్నారు తల్లీకూతుళ్ళు. ఇంతలో దూరం నుండి పర్వేజ్ ఏరుచ్ తమ ఇంటివైపు రావడం చూసింది.

## ఏరుచ్ ఒంటరిగా వచ్చాడు

**బాబావారు లేకుండా ఏరుచ్ తమ ఇంటికి రావడాన్ని చూసిన పర్వేజ్ ఆశ్చర్యపోయింది.** ఒక్క క్షణం కూడా అవతారుడిని వదిలి వుండని ఏరుచ్ మహాశయుడు తమ ఇంటికి ఇలా రావడమేమిటి అనుకుంది పర్వేజ్. అలా వచ్చిన ఏరుచ్ కుశల ప్రశ్నల తర్వాత, లండన్‌లో కుర్షేద్ మరణం గురించి దీనా – పర్వేజ్‌లకు చెప్పాడు. అలాగే బాబావారి షరతు కూడా స్పష్టంగా చెప్పాడు. బాబా ఆషియానాలో వున్నారని, తనతో వారిని తీసుకురమ్మన్నారని చెప్పాడు. పర్వేజ్ వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది. ఆమెని సముదాయించడం ఎవరి తరమూ కాలేదు. బాబా ఎడల వున్న పూర్తి నమ్మకం, విశ్వాసంతో దీనా మాత్రం కంటి తడిపెట్టలేదు. ఆ పిదప వారిద్దర్నీ ఏరుచ్ ఆషియానాలో వున్న బాబా దగ్గరకు తీసుకు వచ్చాడు. అలా వస్తూ మార్గమధ్యంలో వున్న దీనా రెండవ కుమార్తె జూరూ ఇంటి దగ్గర కారు ఆపి, ఆమెను ఎక్కించుకుని బాబా దగ్గరకు బయల్దేరారు. కుర్షేద్ మరణం గురించి తెలుసుకుని జూరూ ఏడవడం మొదలుపెడితే, కారు ఆపించి, నీవిలా ఏడుస్తూ వుంటే, నిన్ను తీసుకెళ్ళి మీ ఇంట్లో దించేస్తానని ఏరుచ్ కోప్పడ్డాడు. బాబా చెప్పినట్లు ఏడవకుండా వుంటేనే మాతో తీసుకెళ్తానని హెచ్చరించాడు. మీరు కంట తడిపెట్టకుండా వుంటేనే

బాబా మిమ్మల్ని చూస్తారన్న బాబావారి సందేశం మరోమారు గట్టిగా చెప్పాడు.

**ఆషియానాలో బాబావార్ని దర్శించుకోగానే, బాబా వారిని ఓదార్చారు. "మీరు ఆనందంగా** వుండండి. కుర్షేద్ చనిపోలేదు. నాలో జీవించి వున్నాడని అన్నారు. నా ప్రతి ఆదేశాన్ని చివరి క్షణం వరకూ కుర్షేద్ తు.చ తప్పక పాటించాడు. ఆ ఆఖరి క్షణంలో కుర్షేద్ నా నామస్మరణ చేశాడు. అతను నన్ను చేరుకున్నాడు. మీరందరూ సంతోషంగా వుండండి. దుఖించొద్దు అని దీనా తలాతి, ఆమె పిల్లల్ని ఓదార్చారు బాబా. కుర్షేద్ ఎంతో అదృష్టవంతుడు బాబా అన్నది దీనా. నీకు ఏడవాలని ఉందా? అని అడిగారు బాబా ఆమెని. లేదు బాబా అన్నది దీనా. నీకు ఇష్టమైనంతసేపు ఏడువు ఈ క్షణంలో. ఆపై మీ కంట కన్నీరు రాకూడని అన్నారు బాబా. పర్వేజ్, జూరూలు మాత్రం తమని తాము నియంత్రించుకోలేక పోయారు. బిగ్గరగా భోరుమన్నారు. దీనా మత్రం రాయిలా నిలబడింది. గుండెను బండరాయిని చేసుకుంది. కళ్ళంబడి నీటిచుక్క రాల్చలేదు. సాధారణంగా ఇలాంటి విషమ పరిస్థితుల్ని ప్రజలు విషాద సమయంగా భావిస్తారు. ఇది చాలా సహజం. అయితే, అవతారుని ప్రేమికులు, ఏది జరిగినా అది బాబావారి ఇచ్ఛ ప్రకారం జరుగుతుందని గట్టిగా నమ్ముతారు. ఆ నమ్మకంతో వారు 'మిన్ను విరిగి మీద పడ్డా' (ఎంతటి కష్టం ఎదురైనా) దేనికీ భయపడరు. బెంబేలెత్తిపోరు. బాబావారి సందేశాలు వారి హృదయాలకు స్వాంతన చిక్కుతుంది. ప్రశాంత వదనంతో వుంటారు ఎన్ని కష్టాలు ఎదురైనా.ఆ దరిమిలా, వారి ముఖాల్లో విషాద ఛాయలు కనపడవు. దీనా తలాతి లాగా!

**దీనా, పర్వేజ్‌లను ఆ రాత్రికి దాదర్‌లో వున్న నర్గీస్, దాదా ఛాన్జీల ఇంట్లో వుండమన్నారు.** ఆ మర్నాడు బాబా వాళ్ళని చూడ్డానికి వచ్చారు. బాబా మెడలో పూలదండ వేసి స్వాగతం చెప్పింది దీనా. ఆమె బాబాతో తన గురించి చెబుతూ, కుర్షేద్‌ని లండన్‌కి పంపి తాను పెద్ద తప్పు చేశానేమో అనిపిస్తోంది బాబా అన్నది. బాబా ఆమెని ఓదారుస్తూ "కుర్షేద్ మరణానికి కారణం నీవనుకుంటున్నావా? ఇదంతా నా పని అన్నారు బాబా. బాబా తన మెడలో వేసిన పూలదండ కేసి చూపుడువేలు చూపిస్తూ, ఈ దండలోని ఒక్క పూరేకు కూడా నా ఇచ్ఛ లేనిదే ఈ దండ నుండి క్రిందికి రాలిపోదు. ప్రత్యేకంగా ఆ రోజున,ఆ పరిస్థితుల్లో, కుర్షేద్ మరణం అనివార్యం. అది నా ఇచ్ఛ ప్రకారమే జరిగింది. అతను బ్రతికివుంటే, అతనింకా అనేక బాధలు అనుభవించవల్సి వుండేది. కాబట్టి, నీవు దేని గురించి చింతించకు. సంతోషంగా వుండు అని దీనాని బాబా అనుయయించారు. ఆ **పిదప, బాబా తనతో దీనాను ఆషియానాకు తీసుకువచ్చారు. దీనా బాబా ఎదుట కూర్చుంది.** నీవు ఇప్పుడు గట్టిగా ఏడువు అన్నారు బాబా. ఆమె ఏడుస్తూ కూడా, ఇది కుర్షేద్ కోసం కాదు బాబా. నీవు నాపై చూపిస్తున్న ప్రేమకు నా మనస్సు ఆర్ద్రమైందన్నది. నీవు మమ్మల్ని

ప్రేమిస్తున్న రీతిలో మేం నిన్ను ప్రేమించలేం బాబా అన్నది. మా పట్ల నీవు చూపిస్తున్న ప్రేమ ఎంతో ఘనమైనది. నీవు నాపట్ల చూపిస్తున్న ప్రేమకు, కరుణకు నేను ఎన్నటికి కృతజ్ఞత చూపలేను బాబా రెండు చేతులూ జోడించింది. జొరాస్ట్రియన్ మతా చారాలకు విరుద్ధంగా, కుర్షేద్ కోసం ఎలాంటి సాంప్రదాయక కర్మకాండలు నిర్వహించ లేదు.

**దీనా తలాతి తల్లి పేరు రూపామాయి. బాబా ఆమెని పిలిచి, ఐదు రూపాయలు ఇచ్చారు.** దాంతో గంధపు చెక్కలు కొనమన్నారు. ఆ తర్వాత ఆ గంధపు ముక్కల్ని పార్శీయుల అగ్ని దేవాలయంలో ఆహుతి ఇవ్వమన్నారు. కుర్షేద్ మరణించిన 17 రోజుల తర్వాత 20 మంది పేదలకు అన్నదానం చేయమన్నారు. ఆ అన్నదానంలో పప్పు, అన్నం, బంగాళ దుంపల కూర మాత్రమే వుండాలన్నారు. ఆ వంటపని మీరే స్వయంగా చేయాలని బాబా సూచించారు. సాధారణంగా జొరాస్ట్రియన్లలో ఎవరైనా చనిపోతే, వారు చనిపోయిన రోజు నుంచి నాలగవ రోజుని చాలా ముఖ్యమైన రోజుగా భావిస్తారు. ఐతే ఆ రోజున బాబా వీరికి ఏమని చెప్పారో తెలుసాండి. ఆ రోజున దీనా – పర్వేజ్‌లను స్త్రీ మండలితో కలిసి **"ది టెన్ కమాండ్‌మెంట్స్"** సినిమా చూడమని ఆదేశించారు. అంతేకాదు, దీనా – పర్వేజ్‌లు స్వయంగా వంట వండి 17 మంది పేదలకు ఫిబ్రవరి 4న భోజనం పెట్టమని ఆదేశించారు. ఆ రోజు ప్రాముఖ్యత ఏమిటో వారికి ఆ తర్వాత ఎప్పుడో తెలిసింది. ఆ రోజున కుర్షేద్ పార్థివ శరీరానికి లండన్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. కుర్షేద్ సంపాదన మీదనే కుటుంబం ఆధారపడి వుంది. అలాంటిది అతని ఆకస్మిక మరణంతో దీనా వెన్నుముక విరిగినట్లైంది. ఆర్థికంగా ఎన్నో కష్టాలను ఆమె చాలా ధైర్యంగా ఎదుర్కొంది. దీనా, ఆమె కుమార్తె పర్వేజ్‌లు జీవనాధారం కోసం ఎన్నో చిన్న వుద్యోగాలు చేశారు. బాబావారి ప్రేమకు అర్హులుగా పలువురికి ఆదర్శంగా నిలిచారు. **Fortunate are they whose love is tested by misfortune** అన్నారు బాబా. అందుకు దీనా – పర్వేజ్‌లు నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తారు.

**1958 ఫిబ్రవరి 28. ఆ రోజున దీనా తలాతి, ఆమె కుమార్తె పర్వేజ్‌లు బొంబాయి నుంచి** మెహెరాజాద్‌కి వచ్చారు. వారితో పాటు కుర్షేద్ అస్తికలు వున్న పాత్రను తీసుకువచ్చారు. ఆ పాత్రను బాబా కొన్ని క్షణాలు తన ఒడిలో వుంచుకుని, ఆ తర్వాత ఏరుచ్ చేతికి ఇచ్చి బధ్రపరచమన్నారు. ఆ మర్నాడు మార్చి 1న బాబా తన మండలితో కలిసి మధ్యాహ్నం 3 గంటలకు మెహెరాజాద్ నుండి మెహెరాబాద్‌కి చేరుకున్నారు. అలీ షా మస్తు సమాధికి ప్రక్కనే సిద్ధంగా వుంచిన గోతిలో బాబా తన స్వహస్తాలతో కుర్షేద్ అస్తికలను వుంచారు. ఆ రోజునే సతారా కారు ప్రమాదంలో మరణించిన డాక్టర్ నీలూ అస్తికలను కూడా కుర్షేద్‌కు ప్రక్కనే ఏర్పాటు చేసిన గోతిలో బాబా వుంచారు. యుగావతారుని చేతుల మీదుగా అంత్యక్రియలు జరిగిన వీరు ధన్యులు. వీరు కారణజన్ములు. ❃

## ముఖచిత్ర కథనం

# బాబావారి టేబుల్ హౌస్

**బాబావారి ప్రతిచర్యకీ ఏదో ఒక విశిష్టత ఉంటుంది. గంగారాం అనే వ్యక్తి వడ్రంగం** పనుల్లో సహాయం చేసేవాడు. బాబా అతడ్ని 'అజోబా' అని ముద్దుగా పిలిచేవారు. 7 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పు, 5 అడుగుల ఎత్తు ఉండేలా ఒక టేబుల్ హౌస్‌ని నిర్మించమని అతగాడ్ని బాబా ఆదేశించారు. ఈ టేబుల్ లోపల ఒక మనిషి కూర్చొనేలా వుండాలన్నారు బాబా. టేబుల్ హౌస్ తయారయిన తర్వాత దాన్ని కొన్నిరోజుల వరకు పోస్టాఫీసు దగ్గర ఉంచారు. ఆ తర్వాత, 1925 అక్టోబరు 4న టేబుల్ హౌస్‌ని, ధునికి దగ్గరలో ఉన్న వేపచెట్టు కిందకి మార్చారు. అక్టోబరు 11 నుంచి బాబా మకాం 'కాబిన్'లోకి మారింది. ఇక్కడ నుండే బాబా తన మండలితో సమావేశమయ్యారు. అందులో కూర్చునే బాబా తమ "రహస్య" గ్రంథం వ్రాయసాగారు.

## జోపిడీలో శ్రీకారం

'రహస్య" గ్రంథం **రచనకి 1925 జూలై 13న జోపిడీలో** శ్రీకారం చుట్టారు. అంటే బాబా మౌనం ప్రారంభించిన మూడవ రోజు. బాబా జోపిడిలో మరియు టేబుల్ హౌస్‌లోకి తన నివాసాన్ని తరచుగా మార్చేవారు. అప్పుడప్పుడు టేబుల్ హౌస్‌లో ప్రత్యేకంగా ఏకాంత వాసం, ఉపవాసం చేసేవారు.

**1928 మే నెలలో మెహెరాబాద్ ఆశ్రమాన్ని టోకా'కు మార్చారు. ఆ సమయంలో** టేబుల్ హౌస్‌ను కూడా టోకాకు తరలించారు. టేబుల్ హౌస్‌లో తాను చేపట్టిన రహస్య గ్రంథాన్ని కొనసాగించారు. ఔరంగాబాద్ పట్టణానికి వెళ్ళే దారిలో, అహమ్మద్‌నగర్ నుండి సుమారు 70 కిమీ దూరంలో వున్న గోదావరి – ప్రవర నదుల సంగమ ప్రాంతం 'టోకా'. ఆనాడు టోకా చిన్న కుగ్రామం. నేడయితే జనసమర్థత అధికంగానే ఉంది. టోకా ఆశ్రమాన్ని మూసివేశాక, 1928 నవంబరు 28న తిరిగి మెహెరాబాద్‌కి మార్చారు. దేవదేవుడు నడియాడిన పావన క్షేత్రం నిర్మాణుష్యమైంది. **టేబుల్ హౌస్‌ను తిరిగి మెహెరాబాద్ జోపిడి సమీపంలో ఏర్పాటు చేశారు. బాబా యొక్క విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమంలో టేబుల్ హౌస్, జోపిడి, ధుని ప్రాంగణానికి అమోఘమైన ప్రాముఖ్యత ఉంది.**

**టేబుల్ హౌస్ – అనంత జ్ఞానానికి, జోపిడి – అనంత శక్తికి, ధుని – అనంత ఆనందానికి ప్రతీకలు. మెహెరాబాద్‌కు విచ్చేసేవారు ఈ మూడు ప్రాంగణాలను తప్పక సందర్శించవల్సిన పుణ్యతీర్థాలు.**

***

### అవతారుని ఉవాచ

# మీలో వున్న దేవదేవుడ్ని దర్శించండి

**1948 ఏప్రిల్ 3వ తేది. శనివారం. ఆ వేళ బాబా తన మండలితో కలిసి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో మస్తుల అన్వేషణలో** వున్నారు. హరిద్వార్ వీధుల్లో బాబా నడుస్తుండగా ఆయన దృష్టి ఒక వృద్ధునిపై పడింది. ఆ ప్రాంతంలో వున్న మస్తుల గురించి వాకబు చేయమని బాబా బైదుల్‌ని పంపారు. బైదుల్ తిరిగి వచ్చాక, బాబా బృందం ముందుకు కదిలారు.

**ఐతే, ఈ వృద్ధుడు కూడా బాబావారిని అనుసరించాడు. 'అతనెందుకు మనతో వస్తున్నాడో** కనుక్కోమన్నారు' బాబా. ఆ వృద్ధుని మాటలు ఆశ్చర్యం కలిగించాయి. అతను అన్నాడు కదా, 'బాబా మీరు గురువు సహాయం లేకుండా దేవుడ్ని తెలుసుకోలేం అని అన్నారు కదా! నేను వయస్సులో పెద్దవాడినవుతున్నాను. పరమాత్మ ఎరుక లేకుండానే తనువు చాలిస్తానేమోనని నాకు బెంగ పట్టుకుంది అని అన్నాడు. **అలా అంటూ బాబావారి కేసి తేరిపార చూస్తూ, "మీరు నాకు భగవన్మార్గం చూపించగలరన్న నమ్మకంతో మీ వెంట వస్తున్నానని", అన్నాడు.**

**బాబా చిరునవ్వులు చిందించారు. ఏరుచ్ ద్వారా అతనికి బాబా ఇలా చెప్పారు.** "దేవుడిని అధికంగా ప్రేమించు. దేవుని కోసం ఎంతగా తపించాలంటే, నీళ్ళలో నుంచి చేపని బైట పడేస్తే, తిరిగి నీళ్ళలోకి వెళ్ళడానికి చేప ఎలా ఆరాటపడుతుందో, అంతగా ఆ పరమాత్మ కోసం పరితపించమని, ఆ వృద్ధునికి బాబా హితవు చెప్పారు. **దేవుని ఎడల అతనికి గల ప్రేమను బాబా అభినందించారు.**

**ఆ పిదప, ఆ వృద్ధుడ్ని తన వద్దకు పిలిపించారు బాబా.** అతను బాబా వద్దకు వస్తూ, తన చేతుల్ని, కాళ్ళను పరిశుభ్రంగా నీళ్ళతో కడుక్కునివచ్చాడు. అతనికి మూడు నారింజ పళ్ళు ప్రసాదంగా ఇచ్చారు. నీలోనే వున్న పరమాత్మను నిరంతరం ప్రేమించు. నీకు భగవద్దర్శనం తప్పక లభిస్తుందని, బాబా భరోసా ఇచ్చారు. ఆనందంతో వృద్ధుడు వెనుతిరిగాడు. **ప్రతి ఒక్కరిలో భగవంతుడు వున్నాడు. మీలో వున్న ఆ దేవదేవుడ్ని, ప్రేమతో దర్శించమన్నది, అవతారుని ఉవాచ.**


## ఇల్లు అమ్మకానికి

మెహెరాబాద్‌లో ఆంధ్ర రెస్ట్ హౌస్‌కి ఎదురుగా వున్న సింగిల్ బెడ్ రూం బిల్డింగ్ అమ్మకమునకు సిద్ధంగా వుందని శ్రీ శ్యాంసుందర్, విశాఖపట్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు 8866195448, 9553334337 సంప్రదించగలరు.



# మెహెరీశం

**అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర**
**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ**
**లార్డ్ మెహెర్, 1925 నుండి**
***తెలుగు సేత: మల్లాది రామారావ్, మెహెరాబాద్***

**(గత సంచిక తరువాయి)**

**ఇహ విమర్శనా అస్త్రాల జోరు ఎక్కువగా వుంటుందనీ, ఇందుకు తామే రంగం సిద్ధం** చేశామనీ బాబావారు అన్న కాసేపటికి లండన్ నుంచి ఉత్తరం వచ్చింది కిట్టీ దేవీకి. ఆమె తండ్రి వ్రాశాడు. బాబావారిని దుమ్మెత్తి పోస్తున్నాయట లండన్ పత్రికలు. అన్నీ కాదు కానీ కొన్ని అదే పనిగా చేస్తున్నాయి దుష్ప్రచారం అని వ్రాశారాయన. అసత్యాలు వ్రాస్తున్నారు. అభాండాలు వేస్తున్నారు. ఈ వార్తలని వెంటనే బాబావారు ఖండించాలి. లేకపోతే దుష్ప్రచారం ప్రజలని తప్పుదోవ పట్టిస్తుందని వాపోయారాయన.

**ఇదంతా పాల్ బ్రంటన్ నిర్వాకం కావచ్చు. ఎందుకంటే కె.జె. దస్తూర్ వలలో పడ్డాడు** ఇతగాడు. విషం కక్కుతున్నాడు. అవాకులు- చెవాకులు వ్రాస్తున్నాడు జాన్ బుల్ అన్న వార పత్రికలో. కుంభకోణం వార్తలకి జాన్ బుల్ పెట్టింది పేరు. ఇంగ్లీషులో బుల్ అంటే మన తెలుగులో ఎద్దు. జాన్ బుల్ అంటే జాన్ గారి ఎద్దు అనో, జాన్ ఎద్దు అనో చెప్పుకోవచ్చు.

**ఇంగ్లీషులో వో సామెత వుంది. పింగాణీ సామాన్ల దుకాణంలోకి వచ్చింది ఎద్దు. స్వైర** విహారం చేసింది. తన కళ్ళ ముందే పింగాణీ గ్లాసులు, కప్పులు, గిన్నెలు, ప్లేట్లు ముక్కముక్కలై పోతుంటే పాపం షాపుకారు తలపట్టుకొన్నాడు. ఈ దృశ్యాన్ని చూసేక పుట్టుకు వచ్చింది సామెత - పింగాణి దుకాణంలో ఎద్దు. మన తెలుగులో అంటారే మోరటాడికి మొగలి పువ్వు యిస్తే యింతే అని ఈ రెండు సామెతలకీ అర్థం, భావం వొక్కటే. మూర్ఖులకి పెత్తనం దొరికితే - తాచెడ్డ కోతి వనమెల్ల చెరిచె అన్న నానుడి నిజమవుతుంది. బ్రంటన్ వ్రాతకోతల వల్ల అంతటి ప్రమాదం, అదే అనర్థం వుండక పోవచ్చు. ఎందుకంటే, బ్రంటన్ వంటి వారి చెడ్డ ప్రచారం కూడా వో రకంగా బాబా నామ ప్రచారమే కదా! వ్యతిరేక పత్రికా కథనాలు చదివి, ఆసక్తి పుట్టి బాబా దర్శనానికి వచ్చిన వారు ఎందరో. అలా వచ్చిన అందరూ కాకపోయినా చాలామంది బాబా కొంగు

పట్టుకొన్నారు. ఇంతకీ మన బ్రంటన్ దొర గారు ఏమి వ్రాశారు. బాబావారిని రెండుసార్లు దర్శించిన ఘనుడు కదా. బాబావారి గురించి నాకు తెలిసినట్లు ఎవరికి తెలియదన్న ధీమాతో విర్రవీగేవాడు. ఈ ధోరణి అతగాని ప్రతిమాటలోనూ తొణికిసలాడింది. బాబావారు కల్లు దుకాణం నడిపేవాడని వ్రాశాడు. ఈయనకి స్త్రీ సహచరులున్నా రన్నాడు. వాళ్లంతగా వాళ్ళు బాబా పంచన చేరలేదన్నాడు. వాళ్ళందర్నీ డబ్బులిచ్చి తనవాళ్ళని చేసుకొన్నాడు బాబా అని వ్యాఖ్యానించాడు.

**బాబావారిని నాసిక్‌లో బ్రంటన్ కలిశాడని పాఠకులకి గుర్తుంది కదా. మరి అక్కడ సరోష్‌కి** వో సినిమాహాలు వుంది. కార్ల రిపేర్ల సెంటర్‌ని (దీన్నే ఇంగ్లీషులో మోటర్ గ్యారేజి అంటారు) కూడా సరోష్ తెరిచాడు. ఈ రెండింటిలో – సినిమాహాల్లో, కార్ల రిపేర్ల సెంటర్‌లో బాబావారి శిష్యులు పనిచేస్తున్నారు. వాళ్ళని అక్కడ పని చేయమని చెప్పింది బాబావారే కదా. ఈ సంగతి ప్రేమిక లోకానికి తెలుసు. పాల్ బ్రంటన్ దొర గారికి తెలిసిన దాఖలా లేదు. వొక వేళ తెలిసినా, బురద జల్లాలి అనుకొనే వాడికి నిజానిజాలు పట్టవు. అదే జరిగింది. మెహెర్‌బాబాకి సినిమా హాలు వుంది, మోటరు గ్యారేజీ కూడా తెరిచాడు అని వ్రాశాడు. ఒక్కమాటలో చెప్పాలి అంటే “బాబా దేముడు, గీముడు కాదు. అంతా బూటకం డబ్బు మనిషి, తస్మాత్ జాగ్రత్త!” అన్న హెచ్చరిక చేశాడు.

**జాన్ బుల్ పత్రిక యాజమాన్యానికి లడ్డూ దొరికినట్లయింది బ్రంటన్ వ్రాతలతో.** కుంభకోణాలని బట్టబయలు చేస్తామని మా పత్రికకి పేరు. ఈ పేరు మరింత సార్థక నామమయింది బ్రంటన్ గారి కథనాలతో అంటూ సగర్వంగా ప్రకటించింది జాన్ బుల్ వార పత్రిక.

**ఇవి చదివిన కిట్టీ డెవీ తండ్రి అగ్గి మీద గుగ్గిలమయ్యాడు. బాబావారికి వెంటనే చెప్పు, బ్రంటన్ నిర్వాకం** ఖండిస్తూ లేఖ వ్రాయండి ఆ పేపరుకి అని కూతురికి వ్రాశాడు. బాబావారికి వినిపించింది తండ్రి వుత్తరాన్ని కిట్టీ. బాబావారు ఎప్పటిలా నిశ్చలంగా కనిపించారు. బ్రంటన్ భాగోతం పట్టించుకోకండి అన్నారు. ఈ విమర్శనాస్త్రాలు కూడా వొక రకంగా మంచివే. ఇదంతా నా లీల. నా జగన్నాటకంలో బ్రంటన్ వో పిట్ట కథ. అతగాడి రచనల పేరు చెప్పి నేనంటే కొంత వ్యతిరేకత ఏర్పడుతుంది. ఆ పరిస్థితిని ఎదుర్కోవడానికి నేను రెడీ అన్నారు చిరునవ్వుతో.

**ఈ వ్యతిరేక పవనాల సృష్టికర్త తామేనన్నారు. కావాలనే ఇలా చేశామన్నారు. ఎందుకట అని** కిట్టీ అడగాలనుకొంది. ధైర్యంకూడగట్టుకొని నోరు తెరిచే లోపలే బాబావారు సందేహ నివృత్తి చేశారు. పశ్చిమ దేశాల్లో ఆధ్యాత్మికోన్నతికి శ్రీకారం చుట్టాను. ఈ కార్యక్రమం వూపు అందుకోవాలన్నా, నలుగుర్నీ మరింత ప్రభావితం చేయాలన్నా, బ్రంటన్ వంటి వారి వ్యతిరేక ప్రచారం అవసరం అంటూ, భవిష్యవాణి చెప్పారు.

తమ దైవీ కార్యక్రమం వల్ల రాబోతున్నాయి ఆధ్యాత్మిక ప్రకంపనాలు అన్నారు. భావోద్వేగ కల్లోలం కూడా తప్పదు అన్నారు. ఈ పరిణామాలు ఎప్పుడు వస్తాయో చెప్పలేదు. అయ్యో! ఆ ఒక్కమాట చెప్పి వుంటే ఎంత బాగుండును. మేము కొంచెం జాగ్రత్తపడే వాళ్ళము కదా అనుకున్నారు శ్రోతలు.

**బాబా వారొక హెచ్చరిక చేశారు తమ శిష్యులకి. బ్రంటన్ వంటి వారి వ్యతిరేక ప్రచారాన్ని** పట్టించుకోకండి అన్నారు. తమ మండలి వారు చలించరు ఈ వ్రాత కోతలకి అన్నారు. నేను ఏమిటో తెలుసు మండలికి. నా లీల గురించీ తెలుసువాళ్ళకి. అందుకనే వారు దేనికీ చలించరు అన్నారు. మీరు (పాశ్చాత్య దేశాల్లోని శిష్యులు) కూడా బెంబేలు పడకండి ఎంత మాత్రం అన్నారు.

**లుగానోలో బాబావారి చుట్టూ చేరిన శిష్యులు ముక్తకంఠంతో చెప్పారు. ఏమని? మీరు** చెప్పినట్లు మండలి ఆదర్శ ప్రాయులు మాకు. వాళ్ళలానే మేము కూడా నిశ్చలంగా వుంటాము. అవాకులు చెవాకులు ఎవరు వ్రాసినా పట్టించుకోము అన్నారు. ఇదేగా బాబావారి హితవాక్కు. బాబావారొక మాట శెలవిచ్చారు. ఆ మాట వింటూనే సిగ్గు పడ్డారు శిష్యులు. ఈ మాత్రం మొట్టికాయ పడకపోతే మనకి బుద్ధి రాదనుకొన్నారు. ఇంతకీ బాబా వారేమన్నారని కదా పాఠక మహాశయా మీ ప్రశ్న. అయితే వినండి.

**పశ్చిమదేశాల ఆధ్యాత్మికోన్నతి కార్యక్రమ భారంతో బాబావారు బాధపడుతున్నారు. ఇది** చూసి శిష్యులు తల్లడిల్లిపోతున్నారు. ఈ సంగతి పాఠకులకి తెలుసు. బాబావారు ప్రస్తావించారీ విషయాన్ని. ఎందుకీ కష్టం మీకు బాబా, ఆ బాధని వ్యతిరేక పవనాల సృష్టికి వాడండి ఎక్కువగా అన్నారు. ఎప్పుడు? కాసేపటి క్రిందట. ఇప్పుడు, అదే జరిగింది. మరి మీరేం చేస్తున్నారు. "అయ్యో! వ్యతిరేక ప్రచారం బాబావారి పట్ల"! అని కొట్టుకు పోతున్నారు. ఇది సబబేనా? అని నిలదీశారు. ఇందాక చెప్పాను కదా! ఈ వ్యతిరేక ప్రచారం కూడా నా సృష్టే! ఇదంతా నా లీల! కాబట్టి మీరు భయపడకండి. అయ్యో! ఏలాగ అంటూ తల పట్టుకోకండి. చెప్పాను కదా. నా జగన్నాటకం యిదంతా. నా వ్యతిరేక ప్రచారం చేస్తున్నది ఎవరో నాకు తెలుసు అన్నారు.

**మీకు తెలుసా బాబా! అయితే ఆ ఘనుడు ఎవరో చెప్పండి', అని మార్గరెట్ క్రాస్కీ అడిగింది.** 'జాన్ బుల్' పత్రికలో వ్యాసకర్త పేరు వేయలేదు అన్నది. "ఆ ప్రబుద్ధుడు రాఫేల్ హార్స్ట్" అన్నారు బాబా. అతగాని కలం పేరు పాల్ బ్రంటన్. లండన్‌లో తమ మీద ప్రతికూలత సృష్టిస్తున్నాడు. పాపం అని, జాలి పడాలి తప్ప, తూర్పార పట్టకూడదు బ్రంటన్‌ని అన్నారు. కె.జె.దస్తూర్ చేతిలో కీలుబొమ్మ అయ్యాడన్నారు. దస్తూర్ ఎవరో తెలుసుగా మీకు. నన్ను ఎంతోకాలంగా అంటిపెట్టుకొన్నాడు కానీ పశ్చిమ దేశాటనకి నాతో తీసుకురాలేదని నాపై ద్వజమెత్తాడు. కారాలు మిరియాలు నూరుతున్నాడు. అతగాడి వలలో పడ్డాడు

బ్రంటన్ దొర గారు, అంటూ బాబావారు దస్తూర్ నిర్వాకం – నయవంచన, కపటం అన్నారు. బ్రంటన్‌కి వాస్తవాలు తెలియవు. దస్తూర్ మాట వేదవాక్కు. నా ఆంతరంగిక కార్యక్రమం, దాని గమ్యం కూడా తెలియదు, దొర గారికి.

**నన్ను దర్శించడానికి మెహెరాబాద్ వచ్చాడు వో సారి. నేను పిలవలేదు. తనంతతానే** వచ్చాడు. సందేహాలు నివృత్తి చేశాను. నా ప్రచారం చేయమన్నాను పశ్చిమ దేశాల్లో. నా మాట బుర్రకెక్కిందో లేదో గానీ, ఇదిగో ఇప్పుడు చూస్తున్నారు కదా దస్తూర్‌లా విషం క్రక్కుతున్నాడు. అసత్య ప్రచారం చేస్తున్నాడు నాపైన. నలుగుర్ని మభ్యపెట్టడానికే ఆశ్రమాలు నడుపుతున్నానట, డబ్బులు యిచ్చి ఆడవాళ్ళని పనిలో పెట్టుకొన్నానట. నా మౌనం వో బూటకమట. ప్రజల్ని మభ్యపెట్టడానికే బాబా మౌనం, మండలి వారితో మాట్లాడుతూ వున్నానట– ఇలా అవాకులు చవాకులు ప్రేలుతున్నాడు బ్రంటన్. ఇవన్నీ ఆరోపణలు. వాస్తవాలు కాదు. నిజానిజాలతో పనిలేదు బ్రంటన్ మహాశయుడికి. మీరు నిజం తెలుసుకోవాలి. వాస్తవాలు చెప్తాను. మీరంటే ప్రేమ నాకు. అందుకనే వాస్తవాల స్పష్టీకరణ చేస్తాను యిప్పుడు ఇక్కడ.

**నాకో సినిమా హాలు వుందని కదూ బ్రంటన్ ప్రచారం చేస్తుంట. ఆ సినిమా హాలు నాది కాదు.** నాది అంటున్న కార్ల గారేజీ నాది కాదు. ఈ రెండు రుస్తుమ్‌వి. రుస్తుమ్ ఎవరు అంటారా, అతను నా ప్రియ శిష్యుడు. సరోష్ కొడుకు. సినిమా హాలుపైనా, గారేజీ పైనా వచ్చే ఆదాయం మీ పనికి అక్కరకు వస్తుంది బాబా అంటూ, ఆ రెండింటిని నాకు వ్రాసి ఇచ్చాడు. కల్లు దుకాణం అంటారా, అదీ నాది కాదు. వో ప్రియ శిష్యుడిది. మెహెరాబాద్‌కి రావటానికి పూర్వం నేను పూనాలోని కస్బాపేటలో వుండే వాడిని. అక్కడ వుందీ కల్లు దుకాణం. తొలి తరం శిష్యులు అక్కడకి చేరేవారు సాయంకాలం. వాళ్ళకి ఆధ్యాత్మిక మర్మాలు చెప్పే వాడిని. ఇదండీ కల్లు దుకాణం కథ.

**ఇహ మిగిలాయి డబ్బు యిచ్చి ఆడవాళ్ళని సేవకులుగా ఉంచుకోవటం. నేను మండలి వారితో** మాట్లాడటం. ఈ రెండు ఆరోపణలని వింటూంటే, బ్రంటన్ పైన, అతని నేస్తం దస్తూర్‌పైనా జాలి వేస్తోంది అన్నారు మెహెరీశుడు. వాళ్ళని క్షమించి వదిలేస్తాను అన్నారు చిరునవ్వుతో. దయ వుట్టి పడింది బాబావారి మాటల్లో. మౌనమూర్తి దయామూర్తి అనుకొన్నారు శిష్యులు.

**మండలివారిపై అంభాండాలను ప్రస్తావించారు. తమ మండలిలో చేరిన స్త్రీ, పురుషులు** ఎటువంటి వారో పేర్కొన్నారు. సుఖసంతోషాలు, డబ్బు, దస్కం, భోగభాగ్యాలు, అన్నీ వాళ్ళు వదిలి పెట్టారు. డబ్బులకి పనిచేసే సేవకులు నా మండలివారిలా పనిచేస్తారా అని బాబావారు అంటుంటే, నిజమే కదా బాబా మాట అనిపించింది తెల్ల శిష్యులకి. మనం రోజూ చూస్తున్నాము కదా, కాకా, ఆదీ ఎలా తలఎత్తకుండా పనిచేస్తున్నారో

అనుకొన్నారు. బాబావారు యిదేమీ పట్టించుకోలేదు సరికదా, ఏమన్నారంటే, నా కోసం ఏది చేయడానికైనా రెడీ వాళ్ళు. నా కోసం ప్రాణాలు యివ్వడానికి కూడా నా మండలి సంసిద్ధులే. నేను సైగ చేస్తే చాలు, ఎంతటి త్యాగానికైనా వాళ్ళు వెనకాడరు. ఈ త్యాగ నిరతి మీ వూహకి సైతం అందదు అని బాబా అంటుంటే, శ్రోతలకి అనిపించింది – మాకే కాదు బాబా, బ్రంటన్ వంటి వాళ్ళకి సహితం బుర్రకెక్కదీ సంగతి అని.

**బ్రంటన్ ఆరోపణా పత్రంలో ఇహ మిగిలింది వొకేవొక అంశం. అది బాబావారి మౌనం గురించి.**

**మీకందరికీ తెలుసుగా నా మౌనం గురించి. వేరే చెప్పేదేముంది అన్నారు బాబా. తాము** చాలా కాలంగా మౌనం పాటిస్తున్నామన్నారు. మీరు చూస్తున్నారుగా – మౌనంగా వుంటూ కూడా నా పనులు నేను ఎలా చేస్తున్నానో. ఇంతకంటే చెప్పేది ఏముంది అన్నారు చిరునవ్వుతో. గాలి కబుర్లు చెప్పేవాళ్ళని చూసి జాలిపడాలి అని అంటూ బాబావారు ఈ వదంతుల మూలవిరాట్టు దస్తూర్ అన్నారు. అందుకనే అతగాడిపై ఎక్కువ జాలి చూపాలన్నారు. నేనే తన సర్వస్వం అన్నాడు. తన రక్తంతో నా పాదాభిషేకం చేస్తానన్నాడు. మరి ఇప్పుడేం చేస్తున్నాడు? మీరు చూస్తున్నారుగా అతని నిర్వాకం. ఇలా అని దస్తూర్ నన్ను ప్రేమించడం లేదా? అంటే నన్ను ప్రేమిస్తున్నాడు మీ అందరిలా కాదు. అలనాటి జూడాస్ లాగ ప్రేమిస్తున్నాడు దస్తూర్.

**జూడాస్ ఎవరో మీకు తెలుసుగా. ఏసుక్రీస్తుకి ద్రోహం చేసిన ఘనుడు. ఏసు ప్రభువుకి** పన్నెండు మంది శిష్యులు. ఆ పన్నెండుగురిలో జూడాస్ ఒకరు. ఇతగాని పూర్తిపేరు జుడాస్ ఇస్కారియాట్. ముప్పయి వెండి వరహాల కోసం కక్కుర్తిపడి ఏసుని వెన్నుపోటు పొడిచాడు. అదీ ఎంత దారుణంగా అంటే, ప్రభువు చేతిని ముద్దుపెట్టుకొని మరీ. రోమన్ సైనికులు ఏసుని పట్టుకోవాలని వచ్చారు. ఏసును గుర్తు పట్టడం ఎలా అని వాళ్ళ బుర్రబ్రద్దలు కొట్టుకొంటే, ఈ చింత మీకెందుకు నేను మీచెంత వుండగా అన్నాడు జూడాస్. నేను ఎవరినైతే ముద్దుపెట్టుకొంటానో అతనే ఏసు. చూస్తూ వుండండి అంటూ, శిష్యులు మధ్య కూర్చొన్న ఏసు దగ్గరకి వచ్చాడు. ఇతను ముద్దు పెట్టుకోవటం, అరెస్టు చేయటం జీసస్‌ని కనురెప్ప వేసేలోపలే జరిగాయి. దరిమిలా జీసస్‌ని శిలవ చేశారు. అయ్యో, నా ప్రభువు చావుకి నేనే కారణమయ్యాను అని జూడాస్ గుండెలు బాదు కొన్నాడుట. లంచంగా తీసుకొన్న ముప్పయి వెండి వరహాలని సర్కారుకి వాపసు యిచ్చి, వురి పోసుకొన్నాడు అంటారు. జూడాస్ కథని మననం చేసుకోవటం ఎందుకు అంటే, ప్రతి అవతారకాలంలోను ఇటువంటి వ్యక్తులు వుంటారని చెప్పడానికే. ఇప్పుడు, ఈ మెహెరావ తారకాలంలో వెలిసిన జూడస్, మనకి చిరపరిచితుడైన కె.జె.దస్తూర్ గారు. **జూడాస్‌గా మారక ముందు దస్తూర్ మహాశయుడు బాబావారికి ఎన్నో ఉత్తరాలు వ్రాశాడు.**

మెహెరీశా, నీ పాదాలకే అంకితం నా జీవితం అన్నాడు. ఈ ఉత్తరాలు తమ దగ్గర ఇంకా వున్నాయన్నారు బాబా. ఆ ఉత్తరాల్లో దస్తూర్ ఏమి వ్రాశాడో మండలి వారికి తెలుసు. ఎవరైనా ఆ ఉత్తరాలని ఇప్పుడు చదివితే, ఔరా! అని ముక్కున వేలు వేసుకొంటారు. దస్తూర్ ప్రవర్తనకి నవ్వుకొంటారు అన్నారు బాబా.

**బ్రంటన్ గురించి ప్రస్తావిస్తూ, పాపం, పసివాడు దొరగారు అన్నారు. దస్తూర్ వలలో పడ్డాడు.** వాజమ్మ అయ్యాడు. దస్తూర్ ఎలా ఆడిస్తే అలా ఆడుతున్నాడు. అతగాని చేతిలో వో పనిముట్టు అయ్యాడన వచ్చు అన్నారు. మెహెరాబాద్‌లో తమ దర్శనం చేసుకొన్నాడు బ్రంటన్ అన్నారు. నాసిక్‌కి కూడా వచ్చాడు. నా దగ్గర వున్నాడు. తన కళ్ళతో చూశాడు నాసిక్ ఆశ్రమంలో ఏమి జరుగుతున్నది. నా సలహా అడిగాడు. తీర్థయాత్రలు చేయమన్నాను. ఏ ఏ చోట్లకి వెళ్ళాలో చెప్పాను. నా మాట పట్టించుకో లేదు సరికదా దస్తూర్ వలలో పడ్డాడు. అసత్య ప్రచారం చేస్తున్నాడు లండన్‌లో. ఈ పరిణామం వూహించిందే. నా వల్లనే ఇలా జరుగుతోందని గ్రహించాలి మీరు. ఒక గంట ముందు మనం మాట్లాడుకొన్నాము – వ్యతిరేక ప్రచారం గురించి. ఇప్పుడు ఆ వ్యతిరేకత వింటున్నాము. ఇదంతా నా ఆట. గాభరా పడకండి. ఈ గాలి కబుర్లు కలత పెట్టకూడదు మిమ్మల్ని. ఈ గొడవ నాకు వదిలేయండి అన్నారు.

**మెరిడిత్ స్టార్ వ్యాఖ్యలని ప్రస్తావించారు. మెరిడిత్** మాటలని పట్టించుకోకండి అన్నారు. అతని అవగాహనా రాహిత్యం చూస్తుంటే, అయ్యో, పాపం, అనిపిస్తోందన్నారు. మీరు నా దగ్గరకి వచ్చేరంటే, అది మెరిడిత్ పుణ్యమే కదా. అందుకనే అతన్ని పట్టించుకోకండి అన్నారు. గుర్తుంచుకోండి వో సంగతి అన్నారు. ఏమా సంగతి అని శిష్యులు అనుకొంటూంటే, బాబావారే శెలవిచ్చారు, మీరు విధేయులుగా వుండవలసింది నాకు. మెరిడిత్‌కి కాదు అని స్పష్టం చేశారు బాబా.

**కిట్టీ ప్రభుతులకి బాబావారు శెహభాష్ చెప్పారు. తమ సేవలో పరిణితి చెందుతున్నారన్నారు.** అవతారుని సేవలో నిస్వార్ధ కార్యకర్త కిట్టీ అంటూ నా ఆనందమే ఆమె కోరుకొనేది అన్నారు. తమని ఎంతో గాఢంగా ప్రేమిస్తోంది. నా కోసం ఏ త్యాగానికయినా రెడీ ఎప్పుడూ అన్నారు. డెలియాకి నేనంటే ఎంతో ప్రేమ. నేనంటే ఎంతో గురి. ఇది ఎవరికీ తెలీదు. ఎందుకంటారా? డెలియాది మూగ ఆరాధన అన్నారు. ఇహ మింటా విషయానికి వస్తే సర్వకాల సర్వావస్థలో బాబా దగ్గరే వుండాలన్నది ఆమె ఆకాంక్ష. ఆత్మ సమర్పణకి రెడీ ఎప్పుడూ అని బాబా అంటుంటే ఆ చిన్నారి గుండె వేగంగా కొట్టుకొంది. నా మనస్సు ప్రభువుకి తెలుసన్నమాట అనుకొంది కించిత్ గర్వంతో.

**–సశేషం**

# పెండూ ఆయుష్షు

–డాక్టర్ మల్లాది శారద



**మండలి సభ్యుడు శ్రీ బాలనాటు చెప్పిన మాటలివి.**

1952 జనవరి నెల.

ఒకరోజున బాబా తన దగ్గర వున్న మండలివారి ప్రతిఒక్కని వయస్సు గురించి అడిగారు. పెండూ వంతు వచ్చే సరికి, తనకింక మరో నాలుగు సంవత్సరాలు మాత్రం ఆయుష్షు ఉందన్నాడు.

బాబా అతనికేసి ఆశ్చర్యంగా చూస్తూ, 'ఎందుకలా? అని అడిగారు.

దానికి సమాధానంగా పెండూ 1926 డిసెంబర్‌లో జరిగిన ఒక సంఘటన గురించి బాబాకి గుర్తుచేశాడు.

అ సంఘటన వివరాలు పెండూ ఇలా చెప్పాడు వివరంగా.

"ఆ సంవత్సరం, బాబా ఆదేశాల మేరకు, మెహెరాబాద్‌లో ఒక బావి త్రవ్వారు. ఆ బావి నేటికీ వుంది. అది మెహెరాబాద్ రోడ్డుకి – రైల్వే ట్రాక్ మధ్యన ఉంది. బావిని తవ్వుతుండగా అడుగు నుండి వచ్చే రాళ్ళు, మట్టి ఇతరత్రా తోలు బక్కెట్‌తో తోడి బైటపడవేసే పనిని నాకు అప్పజెప్పారు. అలా బావిలో నుండి రాళ్ళను బైటకు తీస్తున్నప్పుడు, కొన్నిసార్లు, గురుత్వాకర్షణ శక్తి నన్ను బావిలోకి లాగేస్తున్నట్లు అనిపించేది. మరి కొన్నిసార్లయితే, నేను అందులో పడి చనిపోతానేమోననీ భయపడ్డాను.

***

ఒకరోజున బాబా ఆ బావి తవ్వుతున్న ప్రదేశానికి వచ్చారు. ఆ సమయంలో నా మనస్సులోని బాధ, భయాన్ని బాబాకు ఉన్నదిఉన్నట్లు చెప్పాను.

బాబా నవ్వుతూ, ఓస్! ఇదా నీ భయం! నీవిప్పుడప్పుడే చనిపోవు.
నీకింకా 30 ఏళ్ళ ఆయుష్షు వుందని అభయమిస్తూ, బాబా అక్కడ నుంచి ముందుకు వెళ్ళారు. దాంతో నేను ఊపిరి పీల్చుకున్నానన్నాడు".
ఆ పిదప, బాబా పెండూ వయస్సు గురించి ఎప్పుడు అడిగినా, అసంకల్పితంగా 1926 నాటి బాబా మాటలను గుర్తుచేసేవాడు.

***

ఇదిగో బాబా చెప్పిన ఆ ఆయుష్షు గడువు 1956 డిసెంబర్‌తో ముగుస్తోంది. అందుకే బాబా పెండూ వయస్సు అడగ్గానే, నా ఆయుష్షు మరో నాలుగేళ్ళలో ముగుస్తుందని జవాబిచ్చాడు. పెండూ చెప్పినదంతా ఓపిగ్గా విన్న బాబా, అతనికేసి తీక్షణంగా చూస్తూ, "పెండూ! నీవు 1956 డిసెంబర్‌లో చనిపోవు అన్నారు.
అదే సమయంలో, బాబా తన చేతి వేళ్లను పెండూ శరీరంపై ఎడమవైపు తాకుతూ ఏదో సంజ్ఞ చేశారు. బాబా అలా అనడంలో తనకు మరణం తప్పినప్పటికీ, ఎడమవైపు పక్షవాతం లాంటిది వస్తుందేమో అనుకున్నాడు పెండూ.
ఐతే, తన మనస్సులోని ఈ మాటని బైటకి అనలేదు.

***

1956 డిసెంబర్ 2న సతారా దగ్గర బాబా ప్రయాణిస్తున్న కారుకి జరిగిన ప్రమాదం గురించి ఇక్కడ ప్రస్తావించాలి. ఆ ప్రమాద సమయంలో బాబాతో పాటు కారులో డాక్టర్ నీలు, పెండూ, విష్ణు, ఏరుచ్‌లు వున్నారు. డాక్టర్ నీలూ అక్కడికక్కడే మరణించాడు. పెండూకి తీవ్ర గాయాలయ్యాయి. ఆ తర్వాత, పెండూని సతారాలోని సివిల్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ అతని ఎడమ భుజం నుండి కాలి వేలు వరకూ సిమెంటు కట్టుకట్టారు. నడుం భాగానికి కూడా గాయం కావడంతో కుడి కాలుకి కూడా గట్టి కట్టు కట్టారు. చిన్నపాటిగా కదిలినా తీవ్ర నొప్పిని అనుభవించాడు పెండూ. కొన్నిసార్లయితే స్పృహ కోల్పోయేవాడు. ఒక్కమాటలో చెప్పాలంటే, అతను బ్రతికివున్నా, చనిపోయినవానితో సమానం. ఆ విధంగా పెండూ మరణ శిక్షని బాబా రద్దు చేశారు.

***

**ఇదంతా ఎందుకు ప్రత్యేకంగా ఇక్కడ చెబుతున్నానంటే అంటూ బాలనాటు ఇలా అన్నారు.** బాబా తాను చెప్పదల్చుకున్నది **ఎంత ఖచ్చితంగా** ఉంటుందో తెలియజేయడానికి, అలాగే, దైవీ మానవుని యొక్క **యాదృచ్ఛికమైన సంజ్ఞ** కూడా ఎంత గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంటుందో వివరించడానికే అని, ముగించారు.

**GLIMPSES OF THE GOD-MAN, vol. 2, pp. 391-392**

# మెహెర్‌బాబా మౌనం

# దహీగాంలో ఆఖరి సమావేశం



**అవతార్ మెహెర్‌బాబా 101వ మౌన వార్షికోత్సవ సందర్భంగా, మెహెర్‌బాబా తన గురువుగా** కీర్తించిన ఉపాసనీ మహారాజ్‌తో ఆఖరిసారిగా **1941 అక్టోబర్ 17** జరిగిన సమావేశంకు సంబంధించిన అరుదైన సమాచారాన్ని 'మెహెర్‌బాబా పాఠకుల కోసం' ప్రత్యేకంగా ప్రచురిస్తున్నాం. బాబా మండలి సభ్యుడైన శ్రీ ధాకే ఫాల్కర్ చెప్పిన మాటలివి.

**1941 అక్టోబర్ 17న మెహెర్‌బాబా – ఉపాసనీ మహారాజ్, సాకోరిల నడుమ నాసిక్‌కు దగ్గర్లోని** దహీగాం అనే చిన్న గ్రామ సమీపంలో చిట్టచివరి సమావేశం జరిగింది. వీరిద్దరూ ఇక్కడ ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక శిబిరంలో ఏకాంతంగా సుమారు 30 నిముషాలు సమావేశమయ్యారు. ఆ సమయంలో మెహెర్‌బాబా మండలి వారితో పాటు నేనూ అక్కడ వున్నాను. సుమారు అరగంట తర్వాత బాబా ఆ శిబిరంలో నుంచి బయటకు వచ్చారు. బాబావారి ముఖం ఎంతో తేజోవంతంగా వుంది. అప్పట్లో బాబా అక్షర ఫలకం వాడుతున్నారు. అక్షరఫలకంపై ఆనాటి సమావేశ వివరాలను బాబా మాకు ఇలా చెప్పారు.

**"నన్ను చూడగానే ఉపాసనీ మహారాజ్ గాఢంగా ఆలింగనం చేసుకున్నారు.** త్వరలో తాను దేహత్యాగం చేయబోతున్నానని చెప్పారు. తన తదనంతరం, సాకోరి ఆశ్రమ బాధ్యతలు తీసుకోవాల్సిందిగా నన్ను మహారాజ్ కోరారు. ఐతే, ఒక ప్రత్యేక మతాచారాల ప్రకారం నిర్వహిస్తున్న సాకోరీ ఆశ్రమాన్ని నేను చేపట్టలేనని స్పష్టంగా చెప్పాను. అలాగే, సాకోరి ఆశ్రమవాసులైన సతి గోదావరి మాయి, వోఘ్ (Wogh) లకు ఈ బాధ్యత అప్పగించడం సమంజసమని సలహా ఇచ్చాను. గోదావరి మాయి యొక్క ఆధ్యాత్మిక ఉన్నతి సగభాగం తాను పూర్తి చేశాను, మిగిలిన శేషభాగాన్ని నన్ను స్వీకరించమని, ఆమె తన లక్ష్యం చేరుకునేలా సహాయం చేయమని మహారాజ్ నన్ను కోరారు. అందుకు నేను అంగీకరించాను.

**ఆ తర్వాత, మహారాజ్ నాతో ఎంతో ప్రేమగా,**
నీవు నాతో సాకోరీలో ఉన్నప్పుడు ఎంతో మధురంగా, మృదువుగా
మాట్లాడేవాడివి. నీవిప్పుడు మౌనం చేపట్టావు.
నీ అందమైన గొంతు విని చాలా కాలమయింది.
నేను నీ గురువుని. నీ మధురమైన గొంతు వినాలని వుంది.
దయచేసి, మౌనం విడనాడి కొన్ని క్షణాలు తనతో
మాట్లాడమని మహారాజ్ నన్ను అడిగారు.
ఆయన నా ప్రథమ గురువు. ఆయన మాటను విధేయతతో
అమలు పరచడం నా కర్తవ్యం, విధి.
మహారాజ్ కోసం నా మౌనాన్ని ఆపి మాట్లాడవల్సింది.
కానీ నేను అలా చేయలేక పోయాను. **నా కళ్ళు కన్నీటితో చెమ్మగిల్లాయి.**
**ఆయన పాదాలకు నమస్కరిస్తూ,** నా కన్నీటితో ఆయన పాదాలు
స్పృశించాను. నా గురువు గారి కళ్ళు కూడా కన్నీటితో చిప్పరిల్లాయి.
నా పరిస్థితి చూసి మహారాజ్ అన్నారు కదా – నీ బాధ్యత గురించి నాకు
తెలుసు. నీవు మౌన విరమణ చేయలేవు.
నా కోసం నీవు మౌన విరమణ చేయవద్దు.
ఇప్పుడు నాకు నీ గొంతు వినాలని లేదు.
ఆ విషయం మరచిపోయి, హాయిగా వుండు అని ఉపాసనీ,
నా భుజం తట్టారు. ఆ తర్వాత ఆయన నాకు ప్రేమపూర్వక ఆలింగనం
ఇచ్చారు. నేనూ ఆయన్ని ప్రేమతో కౌగలించుకున్నాను.

**ఆ పిదప, "నీవు అవతారుడవు. గుర్తుంచుకో అన్నారు మహారాజ్.**
**"Remember You are AVATAR"** అని హెచ్చరించారు.
ఆ తర్వాత మేమిద్దరం ఆ శిబిరం నుండి బయటకు వచ్చాం.
ఆపై వారి నుండి వీడ్కోలు తీసుకున్నానని" బాబా
ఆ ప్రత్యేక సమావేశ వివరాలను మాకు వివరంగా చెప్పారు.
**ఆ దరిమిలా, కొద్దిరోజులకే 1941 డిసెంబరు 24న**
**సకోరిలో ఉపాసనీ మహారాజ్ దేహత్యాగం చేశారు.**
**అప్పటికి ఆయన వయస్సు 71 సంవత్సరాలు.**

**(శ్రీ ధాకే ఫాల్కర్ స్వీయరచన – In the Company of Avatar Meher Baba అనే ఆంగ్ల గ్రంథం, పేజి 130 & 131 ఆధారంగా).**

మా అనుభవం

# గురుప్రసాద్ బాబా సమక్షంలో

- శ్రీ ఎ.వి.రాఘవులు, విజయవాడ



ఆ రోజుల్లో నేను కలకత్తాలో వుండే వాడిని. నేను కలకత్తా రైల్వేలో పనిచేస్తుండేవాడిని. ఒక సంవత్సరం బాబా వేసవి విడిదిగా పూణేలోని గురుప్రసాద్ బంగళాలో వున్నారు. ఆ ఏడాది, దేశంలో వున్న పలు బాబా కేంద్రాల వారిని, ఒక్కొక్కరికి ఒక్కోరోజున బాబా దర్శనార్థం అనుమతించారు పూణే, గురుప్రసాద్‌కి ఆహ్వానించారు. మా అందరికీ జూలై నెలలో ఒక రోజు కేటాయించారు. కలకత్తా సెంటర్ నుండి 15 మందిమి గురుప్రసాద్‌కు చేరుకున్నాం. మాకు కేటాయించిన సమయంలో బాబా దర్శనం చేసుకున్నాం. మమ్మల్ని అందర్నీ పేరు పేరునా పలకరించారు బాబా ప్రేమతో. చక్కని సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ పిదప, అవతారుని దివ్య తేజోమయ దర్శనం చేసుకున్నామన్న తృప్తితో ఆ సాయంత్రం గురుప్రసాద్ నుండి రైల్వే స్టేషన్‌కు వెళ్ళబోతుంటే, మండలి సభ్యుడైన ఏరుచ్ చప్పట్లు కొడుతూ నన్ను బాబా పిలుస్తారని చెప్పాడు. దాంతో నేను తిరిగి బాబా వారి గదికి వెళ్ళాను. బాబా ఎదుట నిలుచున్నాను. బాబా ఏమన్నారో తెలుసాండి!

**రేపటి రోజు ప్రాముఖ్యత తెలుసా? అని ప్రశ్నించారు బాబా.**
నేను జవాబిచ్చేలోగానే, రేపు నా పుట్టినరోజు కదా! అన్నారు.
బాబా పుట్టినరోజు ప్రతి ఏడాది ఫిబ్రవరి25న కదా మనం జరుపుకునేది.
ఇది జూలై నెల కదా?
ఇదేంటి చెప్మా...అని ఆలోచనల్లో నేను వుండగా.......
బాబానే తిరిగి నాతో అన్నారు.
రేపు నా పుట్టిన రోజు. రేపు శ్రీకృష్ణాష్టమి.
**Birthday of Lord SriKrishna.**
**I am that Lord SriKrishna** అన్నారు.

అంతేకాదు, రేపు కూడా మీరు ఇక్కడ వుండగలరా అని అడిగారు.
నా పుట్టినరోజు వేడుకలలో పాల్గొనగలరా అని అన్నారు.
ఇది బాబావారి నుండి ఊహించని ఆహ్వానం.
సాక్షాత్తూ దేవదేవుడ్ని మరొక రోజు దర్శించుకునే అవకాశం కల్పిస్తే, ఎవరైనా తబ్బిబ్బయిపోరూ! ఆ ఆనందంలో వెంటనే తప్పక హాజరవుతాం బాబా అన్నాను, విధేయతతో.,
ఐతే, చిన్నపాటి విషయాల్లో కూడా మెహెర్‌బాబా ఎంత సున్నితంగా ఆలోచిస్తారో చూడండి.
“మిమ్మల్ని గురుప్రసాద్‌లో ఒక్కరోజు దర్శనార్థం రమ్మనమని ఆహ్వానం పంపాను. మరి మీ అందరికీ రేపు కూడా ఉండటానికి వీలౌతుందా? అని ప్రశ్నించారు. అంటే ఉద్యోగాలకు సెలవు, రైలు రిజర్వేషన్‌లు, ఇతరత్రా ఇబ్బందులు కలగవు కదా అన్నది బాబావారి ఉద్దేశ్యం.
ఇబ్బంది ఏమీ లేదు బాబా, తప్పకుండా ఈ రాత్రికి వుండి రేపటి బాబా పుట్టినరోజు కార్యక్రమానికి అందరం హాజరుకాగలం అన్నాను.
బాబా ఇంకా ఏమన్నారంటే,
నీ విషయం సరే! మీ కోల్‌కత్తా బృంద సభ్యులందరికీ వీలౌతుందో లేదో వాకబు చేయమన్నారు.
నేను తిరిగి మా వాళ్ళందర్నీ కలిసి వారి వీలు కనుక్కున్నాను. ఆ పిదప, వారందరినీ బాబా ఎదుటకు తీసుకెళ్ళాను.
వాళ్ళెవరికి ఎలాంటి అసౌకర్యం లేదని బాబా ఎదుట చెప్పారు.
బాబా సంతోషించారు. మమ్మల్ని అందర్నీ ఆ మర్నాడు ఉ. 8 గంటలకు గురుప్రసాద్‌కు రమ్మనమన్నారు.
ఠంచన్‌గా ఉదయం 8 కల్లా గురుప్రసాద్‌కు చేరుకున్నాం.
గురుప్రసాద్ బంగళా మొత్తాన్ని చాలా అందంగా అలంకరించారు.
విచ్చేసిన వారందర్నీ బాబా ప్రేమగా పలకరించారు. మండలివారు బాబాకు ప్రార్థనలు, ఆరతి పట్టారు. కొందరు చక్కని భజన గీతాలు ఆలాపించారు. కార్యక్రమం ఆద్యంతం చక్కగా జరిగింది. ఆ రోజున బాబా మా అందరికీ ఆలింగనం ఇచ్చారు. స్వయంగా చేతినిండా ప్రేమతో ప్రసాదం ఇచ్చారు. ఆ పిదప, మీ హృదయాల్లో నన్ను నింపుకొని నేరుగా మీ ఇళ్ళకు తిరిగి వెళ్ళండని, ప్రేమతో బాబా వీడ్కోలు పలికారు.

***

# బాబాలో ఐక్యమయ్యారు



## శ్రీ ఎలమర్తి చిరంజీవిరావు

సికింద్రాబాద్‌లోని లోతుకుంటలో వుంటున్న బాబా ప్రేమికులు శ్రీ ఎలమర్తి చిరంజీవిరావు 2026 జూన్ 25వ తేదీన బాబాలో ఐక్యమైనట్లు వారి కుటుంబసభ్యులు తెలిపారు. శ్రీ చిరంజీవి రావు ఎంతోకాలంగా బాబా సేవ - ప్రేమలో తరిస్తూ, నిరంతరం బాబా నామస్మరణలో గడుపు తున్నారు. ఆయన స్మృత్యర్థం ప్రేమిక సహవాస్ వారింట నిర్వహించారు. స్థానిక బాబాప్రేమికులు బాబా సేవలో వారు తరించిన వైనాన్ని గుర్తుచేసుకుని, వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని బాబాని ప్రార్థిస్తూ కొన్ని క్షణాలు మౌనం పాటించారు.



## శ్రీమతి తులసీ రత్నం

నరసన్నపేట బాబా ప్రేమికురాలు శ్రీమతి తులసీ రత్నం 2026 జూన్ 28వ తేదీన బాబాలో ఐక్యమైనట్లు స్థానిక బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని మెహెర్‌బాబాని ప్రార్థిస్తూ కొన్ని క్షణాలు మౌనం పాటించినట్లు వారు తెలిపారు.



## శ్రీ బి. గిరిధర్

హైదరాబాద్ బాబా కేంద్ర ప్రేమికుడు శ్రీ బి. గిరిధర్ స్వల్ప అస్వస్థతతో ఆకస్మికంగా 2026 జూలై 12న మ. 3.30 ప్రాంతంలో బాబాలో ఐక్యమైనట్లు స్థానిక బాబా ప్రేమికులు తెలియజేశారు. అవతారుని ప్రేమ- సేవలకు సంపూర్ణంగా అంకితమైన కుటుంబ నేపథ్యం వీరిది. శ్రీ గిరిధర్ స్థానిక బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, నిరంతరం బాబా సేవ, నామస్మరణలో గడిపేవాడని, వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని బాబాని ప్రార్థించినట్లు బాబా ప్రేమికులు తెలిపారు.

# ప్రొఫెసర్ కొర్ర వెంకట్‌రావు



**బాబా ప్రేమికులు ప్రొ.వెంకటరావు మితభాషి. మెహెర్‌బాబా సత్య సందేశాలను అనర్గళంగా** ఆహుతుల హృదయాలకు హత్తుకునే విధంగా ప్రసంగించే గొప్ప వక్త. మెహెర్‌బాబా వారి ప్రేమతత్వాన్ని, ఆధ్యాత్మిక విశిష్టతను వివరిస్తూ పలు విశేష ప్రసంగం చేసేవారు. శ్రీ వెంకట్రావు గారితో గత 40 సంవత్సరాలకు పైగా మాకు గల అనుబంధం మరుపురానిది. బాబా ప్రేమ –సేవలో నిరంతరం తరించిన ధన్యజీవి శ్రీ వెంకట్రావు. అత్యున్నత సాహిత్య విలువలతో కూడిన ఎన్నో గేయాలను, భజన గీతాలను సరళమైన భాషలో ఆయన రాశారు. యక్షగానంలో చక్కని అభినయం, వాక్చాతుర్యంతో ఎన్నో పర్యాయాలు పలు ప్రాంతాల్లో ప్రదర్శించారు. మెహెర్‌బాబా సత్యప్రేమ సందేశాల వ్యాప్తికి అవిశ్రాంతంగా శ్రీ వెంకట్రావ్ గారు చేసిన కృషి శ్లాఘనీయం. వారికి అవతారుడు సద్గతి కల్గించాలని ప్రార్థిస్తున్నామని శ్రీమతి చెట్టు ఉషా దేవి, యుఎస్ తెలియజేశారు.

## ఉత్తమ ఉపన్యాసకుడు

**– డాక్టర్ పప్పూరి నికుంజ్ విశాఖపట్నం**

**మెహెర్‌బాబాతో ప్రతి శ్వాసలో నడిచినవాడు,**
**నిజమైన బాబా ప్రేమికులు మీరు,**
**వేదికపై మీ గొంతు ఎదిగి పొంగేది,**
**అద్భుతమైన వక్తగా సత్యం పలికేవారు...శ్రీ వెంకట్రావ్ అంటూ,**

**ఆయన** భౌతికంగా మన మధ్యన లేకపోయినా, ఆయన రాసిన పాటలు, చేసిన ప్రసంగాలు బాబా ప్రేమికలోకానికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని, వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు.

# గాజువాక కేంద్రంలో

గాజువాక కేంద్రంలో 2026 జూలై 14వ తేదీన ప్రత్యేక సంకీర్తన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా శ్రీ జి. కాంతాయ్, హైదరాబాద్ పాల్గొన్నారు. అవతార్ మెహెర్‌బాబా మౌన విశిష్టత, మహమ్మద్ మస్తు గురించి శ్రీ వింజమూరు శ్రీనివాస్ తెలియజేశారు. శ్రీ మెహెర్ సంగీత్ బాబావారి భజన గీతాలు ఆలాపించారు.

# మెహెరాబాద్ - సమాధి పరిరక్షణలో భాగంగా

2026వ సంవత్సరం వేసవి కాలంలో బాబా సమాధి పరిరక్షణ పనులను విజయవంతంగా పూర్తిచేసినట్లు బాబా ట్రస్టు న్యూస్ లెటర్‌లో ప్రకటించింది. సమాధి లోపలి గోడలపై చిత్రించిన దెబ్బతిన్న కుడ్య చిత్రాలను పునరుద్ధరించారు. ఉత్తర దిక్కున కిటికీలో ఉన్న ఫ్రేమ్ చేసిన పెయింటింగ్‌ను కూడా చాలా నిశితంగా పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. సమాధి వెలుపలి భాగంలోని రాతి గోడలు అలాగే పైభాగంలోని ప్లాస్టర్ బ్యాండ్ ప్రాంతాలను కూడా సంపూర్ణంగా మరమ్మత్తు చేశారు. సమాధి పైభాగాన వున్న డోమ్, దానికి నాలుగు దిక్కులా వున్న మతపరమైన చిహ్నాలు, అగ్రభాగాన వున్న కలశాన్ని మరమ్మత్తు చేసి, 1991లో బాబావారి సోదరి మణి ఖరారు చేసిన రంగుల విధానంలోనే తిరిగి రంగులు వేసినట్లు ప్రకటించారు. డోం పైభాగంలో ఉన్న కలశానికి అద్దిన బంగారు పూత ఆకర్షణీయంగా వుంది. ఇటీవల జూలై 10న మౌన వార్షికోత్సవానికి విచ్చేసిన బాబా ప్రేమికులు సమాధి ప్రాంగణంలో చేసిన ఈ మరమ్మత్తులు గమనించే వుంటారు.

## మెహెరా మాయి సమాధిపై

బాబా సమాధికి ప్రక్కనే వున్న మెహెరా మాయి సమాధిపై వున్న షెల్టర్‌పై వానా కాలంలో పడే వాన నీటి వల్ల బాబా సమాధి గోడలు దెబ్బతినే ప్రమాదాన్ని గుర్తించారు. దీనికి పరిష్కార మార్గంగా, ప్రస్తుతం దర్శనం క్యూ లైన్ల పైన వున్న ఆకుపచ్చని ఓవర్‌హెడ్ షెల్టర్‌ను మెహెరా మాయి సమాధితోపాటు ఇతర స్త్రీ మండలి సమాధుల వరకూ పొడిగించారు. దీనివల్ల వానాకాలంలో ఎదురయ్యే సమస్యకు పరిష్కారం చిక్కడంతో పాటు దర్శన క్యూలైన్లుకు విశాలమైన స్థలం లభించినట్లైంది.

**మెహెరాబాద్ న్యూస్ లెటర్ - ఇన్ హిజ్ సర్వీస్ జూన్ 2026 ఆధారంగా**

# పావగడలో ప్రేమిక సహవాస్

శ్రీ ఎ.యమ్. రఘుపతి నాయుడు గారి ఆధ్వర్యం పావగడలో రెండ్రోజుల బాబా ప్రేమిక సహవాస్ జూన్ 20, 21 తేదీలలో వైభవంగా నిర్వహించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ ప్రసాద రాజు, శ్రీ మెహెర్ ఈశా, శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా, శ్రీ మెహెర్ సుధాకర్, శ్రీ ఆర్. రామచందర్ తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారని తెలిపారు. పావగడ గ్రామంలో బాబా నామస్మరణతో పెద్ద ఊరేగింపు నిర్వహించినట్లు, రాయలసీమలో గల అన్ని బాబా కేంద్రాల నుండి ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని తెలిపారు.

# మెహెర్‌బాబా మండలి సభ్యులు

## పరమాత్మకు ఆంతరంగికుల జీవిత చిత్రాలు




**మెహెర్‌బాబా సందేశాలు చాలా సరళంగా వుంటాయి. అవి చదవడానికి ఎంతో సులభంగా** అనిపించినా, ఆచరణలో అసాధ్యం అని చాలామంది భావించడం కద్దు. అలాంటి అనితరసాధ్యమైన బాబా సందేశాలను నూటికి నూరు శాతం తమ జీవితాల్లో అన్వయించుకుని ఆచరణలో చూపిన మహనీయులు బాబా మండలి. నేడు ఎగువ మెహెరాబాద్‌లో స్త్రీ మండలి, దిగువ మెహెరాబాద్‌లో పురుష మండలి సమాధులు వున్నాయి.

**ఆ అద్వితీయ భాగవతోత్తముల జీవిత విశేషాలను 'మెహెర్‌బాబా మండలి' శీర్షికతో** 300 పేజీల గ్రంథంగా ప్రచురిస్తున్నాం. మా ప్రయత్నం తుది దశకు చేరుకుంది.

**కాలక్రమేణా ఈ మహనీయుల గురించిన సమాచారం కథలు కథలుగా మారి, భవిష్యత్తులో** ఎలాంటి రూపాంతరాలకు లోనుకాకుండా ప్రామాణికంగా ఉంచడం మన బాధ్యత. అందుకే, సమగ్రమైన, సాధికారికమైన సమాచారాన్ని సేకరించి, క్లుప్తంగా నేటి పాఠకులకు అందజేయాలన్నదే ఈ పుస్తకం ప్రచురణ ప్రధాన ఉద్దేశ్యం.

# తాడేపల్లిగూడెం రామారావుపేట నూతన కార్యవర్గం



తాడేపల్లిగూడెం రామారావుపేట బాబా కేంద్రంలో జూలై మొదటి వారంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2026 – 2027 సంవత్సరానికి గాను కేంద్ర అధ్యక్షులుగా డాక్టర్ విజయసారధి, ఉపాధ్యక్షులుగా శ్రీ జి. జగన్మోహన్ రావు మరియు శ్రీమతి ఎ. అనూరాధ, కార్యదర్శిగా డాక్టర్ కె. నారాయణరావు, సహాయ కార్యదర్శిగా శ్రీ కె.వి. సత్యనారాయణ మరియు శ్రీమతి ఎ. నాగరత్నం, కోశాధికారిగా శ్రీ వి. కామేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, 14 మంది కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## చల్లపల్లి సెంటర్

జూన్ 7వ తేదీన ఉదయం 5.30 నుండి 7 వరకు శ్రీ దాసరి మెహెర్ హేమంత్, మెహెర్ రాకేష్ సోదరుల కుటుంబసభ్యులచే ఏకనామం కార్యక్రమం బాబా సెంటర్ నందు వైభవంగా జరుపబడినది. కాగా ప్రతివారం నిర్వహించే సత్సంగ్ కార్యక్రమాలలో బాబా సందేశాలపై శ్రీ చుండూరి మెహెర్ ప్రసాద్, శ్రీ పురిమి రమేష్, శ్రీ పి. వి. రమణారావు, శ్రీ మద్దాళి దుర్గాప్రసాద్, శ్రీమతి కె. సులోచన తదితరులు ప్రసంగించారు.

**చల్లపల్లి బాబా కేంద్ర 61వ వార్షికోత్సవం, ప్రేమిక సహవాస్ రెండ్రోజులపాటు 2026 ఆగస్టు 29, 30** తేదీలలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు శ్రీ చుండూరి మెహెర్ ప్రసాద్ తెలిపారు. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొనవల్సిందిగా కోరుతున్నారు.

# మెహెర్‌బాబా పత్రిక ముద్రణ, రవాణా ఖర్చులు




**పత్రిక ముద్రణ, రవాణా, నిర్వహణ ఖర్చులు అనూహ్యంగా పెరిగాయి. సుమారు** పదేళ్ళ క్రితం వరకూ జాతీయ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై బ్యాంకు వడ్డీ 12 శాతం వరకూ వుండేది. ఆ కారణంగానే, వార్షిక చందా రూ. 100/-, జీవిత సభ్యత్వం రూ. 1000/- నిర్ణయించాం. జీవిత సభ్యులు చెల్లించిన నగదుపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రికా నిర్వహణలో నేటికీ వినియోగిస్తున్నాం.

**నేడు బ్యాంకులు ఇస్తున్న వడ్డీ రేట్లలో గణనీయమైన మార్పు వచ్చింది. ఆ కారణంగా ఈ క్రింది నిర్ణయాలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రతిపాదించడమైంది. 1. వార్షిక సభ్యత్వం రూ. 150/-, 2. జీవిత సభ్యత్వం రూ. 2,000/- గా మార్పు చేయడమైంది. ప్రస్తుతం వున్న జీవితసభ్యులు, అంటే ఇంతక్రితం వెయ్యి రూపాయలు మాత్రమే చెల్లించిన వారు కూడా,** వీలున్న మేరకు, మా ప్రతిపాదనను మన్నించి అదనపు వెయ్యి రూపాయలు మీ వీలువెంబడి పత్రిక చిరునామాకు పంపవల్సిందిగా కోరుతున్నాం.

**మా ఈ విజ్ఞప్తిని మన్నించి ఇప్పటికే చాలామంది అదనపు వెయ్యి రూపాయలు చొప్పున పంపుతున్నారు.** జీవిత సభ్యుల చెల్లింపుల వివరాలు ప్రతినెలా పేజి 40లో ప్రచురిస్తున్నాం. పాఠకులు గమనించగలరు. **మీ సహకారం కోరుతూ, మీ సూచనలు, సలహాలు మా వాట్సప్ నంబర్ 99595 53218 తెలియజేయగలరు. జైబాబా.**

## కొత్త ఇ - మెయిల్

మెహెరాబాద్‌లో వసతి కోరువారు బాబా ప్రేమికులు ఇకపై తమ అభ్యర్థనలను ఈ క్రింది ఇ-మెయిల్‌కు పంపవల్సిందిగా బాబా ట్రస్టువారు కోరుతున్నారు. నూతన ఇ-మెయిల్ ఐడి **reservation@mail.ambppct.org** మరింత సమాచారం కోసం ఫోన్ 0241-2548733 / 2548736 సంప్రదించగలరు.

# మా ప్రచురణలు




ప్రతులకు ఫోన్ **99595 53218** సంప్రదించగలరు




101th
SILENCE
DAY


101th
SILENCE
DAY

మెహెరాబాద్
చిత్రమాల


BABAS
TABLE HOUSE
101
SILENCE
DAY



## జీవిత సభ్యత్వం

**2026 జూన్ -జూలై నెలలలో పంపిన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | శ్రీ జె. శ్రీనివాస బాబా, కేరాఫ్ కోటేశ్వరరావు, ఖమ్మం | రూ. 1000/- |
| 2. | శ్రీ మోహనరావు. డి. ఖమ్మం | రూ. 1000/- |
| 3. | శ్రీ శివరామ ప్రసాద్, హైదరాబాద్ | రూ. 1000/- |
| 4. | శ్రీ కొంపెల్ల మెహెర్ కాంతి, తాపేశ్వరం, తూగోజి | రూ. 1000/- |
| 5. | శ్రీ కె. నారాయణరావు & శ్రీమతి ఉమామహేశ్వరి, విజయనగరం | రూ. 1000/- |
| 6. | శ్రీ ఎస్.ఎస్,వి.ఆర్. శ్రీనివాసరావు, కాకినాడ | రూ. 1000/- |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 2000/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 150/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

### మా అడ్రస్:

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్,** యాప్రాల్, ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
**ఫోన్: 99595-53218. email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Caxton Printers, Lakdi-ka -Pul, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Posted at Patrika Channel, Nampally, Hyderabad.**